



# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక

సంపుటి: 4 సంచిక: 297, పేజీలు - 08

శనివారం, మార్చి 15, 2025 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati





# ఇటు కేసీఆర్.. అటు జగన్

## - అసెంబ్లీకి హాజరుపై పోలికేంటి.?



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అటు ఆంధ్రప్రదేశ్ ఇటు తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ సమావేశాలకు ఇక్కడ కేసీఆర్, అక్కడ జగన్ అసెంబ్లీకి హాజరుకావడం, కాకపోవడంపైనే ప్రధాన చర్చ సాగుతోంది. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కాగా ప్రధాన ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీకి హాజరయ్యారు. ఏకంగా 8 నెలల తరువాత అసెంబ్లీలో కేసీఆర్‌ను ప్రజలు చూడగలిగారు. ఆంధ్రప్రదేశ్‌లో ముందుగానే ప్రారంభమైన బడ్జెట్ సమావేశాల తొలి రోజు గవర్నర్ ప్రసంగం నాడు అసెంబ్లీకి వైఎస్ జగన్ హాజరయ్యారు. పట్టుమని 10 నిమిషాలే ఉండి తమ పార్టీ సభ్యులతో సహా బైటకు వెళ్లిపోయారు. కేసీఆర్ కూడా గవర్నర్ ప్రసంగం నాడు బడ్జెట్ సమావేశాల తొలిరోజు హాజరయ్యారు. అయితే సమావేశాలకు రిగ్యులర్‌గా హాజరు కాలేక పోయినా, కీలకమైన సమయాల్లో తమ నేత సభకు హాజరవుతారని బీఆర్ఎస్ కీలక నేత, కేసీఆర్ తనయుడు కేటీఆర్ తెలిపారు. అంటే మొత్తంగా అసెంబ్లీ సమావేశాలకు దుమ్మా కొట్టకుండా, కొంత మేర సమావేశాలకు హాజరుకావడానికి కేసీఆర్ సిద్ధంగా ఉన్నారని భావించాలి.అయితే జగన్ పరిస్థితి వేరు, తనకు ప్రతిపక్ష నేత హోదా కూడా లేదు. ప్రతిపక్ష నేతగా గుర్తిస్తేనే సభకు వస్తానని తేల్చిచెప్పారు కూడా. ఇప్పుడు అదే చర్చ సాగుతోంది. అసెంబ్లీకి రావడానికి కేసీఆర్ కొంత సుముఖంగా ఎందుకు ఉన్నారు. జగన్ ఎందుకు సుముఖంగా లేరన్నది ప్రధానమైన ప్రశ్నలు.

### - కేసీఆర్ ప్లస్‌లు, జగన్ మైనస్‌లు ఏంటి?

తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి మొత్తం 38 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. పది మంది పార్టీ ఫిరాయించినా

2లో..

# పోక్సో కేసులో యడియూరప్పకు స్వల్ప ఊరట

## - హైకోర్టు కీలక నిర్ణయం



బెంగుళూరు (ప్రశ్న న్యూస్) 17 ఏళ్ల బాలికపై అత్యాచార ఆరోపణలపై నమోదైన కేసులో బీజేపీ సీనియర్ నేత, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్పకు ఆ రాష్ట్ర హైకోర్టులో కాస్త రిలీఫ్ దక్కింది. మానసిక ఆరోగ్య సమస్యలు ఉన్న ఓ బాలికను లైంగికంగా వేధించారని యడియూరప్పపై ఆరోపణలు రాగా పోక్సో కేసు నమోదు చేశారు. ఈ పోక్సో కేసులో మార్చి 15వ తేదీన విచారణకు హాజరుకావాలని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఇటీవల ఆదేశాలు జారీ చేసింది.

2లో..

# రాజాసింగ్ వ్యాఖ్యలతో రేవంత్ రెడ్డి దొరికిపోయారు

## - రహస్య సమావేశం సిగ్గుచేటు అన్న కేటీఆర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ బీజేపీ నేతలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రహస్యంగా సమావేశం కావడం సిగ్గుపడాల్సిన విషయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీలో బీజేపీ కోవర్టులు ఉన్నారని రంకెలు వేసే రాహుల్ గాంధీకి, బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యలతో దొరికిపోయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకునే ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. తెలంగాణ బీజేపీకి చెందిన కొందరు నాయకులు రేవంత్ రెడ్డితో రహస్యంగా భేటీ అవుతున్నారని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన ఆరోపణలు చేసినట్టు వచ్చిన పత్రికా కథనాన్ని తన 'ఎక్స్' వేదికగా పంచుకున్న కేటీఆర్ విమర్శలు గుప్పించారు."బీజేపీ నేతలతో కాంగ్రెస్ ముఖ్యమంత్రి

2లో..

# హనీ ట్రాప్ వలలో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగి

## - భారత రక్షణ రంగ రహస్యాలను పాకిస్తాన్ ఐఎస్ఐకు లీక్

2లో..



# మార్చిలోనే మండుతోన్న ఎండలు

2లో..

## - 40 డిగ్రీల పైకి చేరుకున్న ఉష్ణోగ్రతలు




# అన్నీ ఒక్కడినై పోరాటం చేశా

## - జయకేతనంలో సభలో పవన్ కల్యాణ్ పవర్‌ఫుల్ గర్జన

- జన్మస్థలం తెలంగాణ, కర్మస్థానం ఆంధ్రప్రదేశ్
- తమిళులు చూపుతున్న ప్రేమకు కృతజ్ఞుడిని
- గద్దర్‌కు నివాళులు అర్పించిన పవన్ కళ్యాణ్
- మార్పు కోసం వచ్చా, ఓట్ల కోసం కాదు
- మనం నిలబడి, టీడీపీని నిలబెట్టమన్న పవన్
- భవిష్యత్ నిర్మాణానికి యువనాయకత్వం రావాలి
- మనదేశంలోని భాషలనే ద్వేషించడం అవివేకం

2లో..





# పేర్లను సిఫారసు చేయకుండా ఆలస్యం చేస్తున్నారు

- మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- నామినేటెడ్ పోస్టుల కోసం కసరత్తు చేస్తున్నామని వెల్లడి
- పార్టీ కోసం కష్టపడిన వారికే పదవులు అని స్పష్టీకరణ
- పార్టీ కోసం శ్రమించిన వారి వివరాలు పంపాలని నేతలకు ఆదేశం



అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీ సీఎం చంద్రబాబు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నేతలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన

2లో..

# లేఖలు అంగీకరించకుంటే తిరుమలకు వచ్చి తేల్చుకుంటాం

- శ్రీవారి దర్శనాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలన్న బీజేపీ ఎంపీ
- ఈ విషయంపై చంద్రబాబు స్పందించాలన్న రఘునందన్ రావు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రజాప్రతినిధులకు తిరుమలలో సమస్యలు తప్పడం లేదు. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు పరిస్థితి తయారైంది. తెలంగాణ ప్రజా ప్రతినిధులు ఇచ్చే సిఫార్సు లేఖలను తిరుమలలో పట్టించుకోవడం లేదు అని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు వ్యాఖ్యానించారు. శుక్రవారం వీఐపీ బ్రేక్ దర్శనం సమయంలో ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నరు, అనంతరం రఘునందన్ రావు పలు విషయాలపై మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రాంత ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు ఇచ్చే సిఫార్సులను తిరుమలలో తీసుకుంటామన్నారు. ఫిబ్రవరి 1 నుంచి ఇది అమలవుతుందని ఏపీ ప్రభుత్వం, టీటీడీ సైతం తెలిపింది.

# హోలీ వేడుకల్లో మత్తు దందా

## - ఐస్‌క్రీమ్, కుల్ఫీలో గంజాయిని కలిపి విక్రయం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలో హోలీ వేడుకలు అంబరాన్నంటాయి. అయితే, కొందరు హోలీ వేడుకలను ఆసరా చేసుకుని తమ మత్తు దందాకు తెరలేపారు. హోలీ వేడుకల్లో గంజాయితో తయారు చేసిన కుల్ఫీ, ఐస్‌క్రీమ్ తోపాటు గంజాయి బాల్స్, చాక్లెట్స్ విక్రయిస్తున్న ముఠాను స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ మహా నగరంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు వారి వారి రీతుల్లో హోలీ వేడుకను జరుపుకుంటున్నారు. కాగా, దూల్‌పేట్‌లోని మల్చిపురాలో కుల్ఫీ, ఐస్‌క్రీమ్, బర్ఫీ స్వీటులో, సిల్వర్ కోటెడ్ బాల్స్‌లో గంజాయి వినియోగిస్తూ సంబరాలు జరుపుకున్నారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్టీఎఫ్ పోలీసులు దాడులు నిర్వహించి నిందితులను అరెస్ట్ చేశారు. మత్తు పదార్థాలను తినే పదార్థాలలో కలిపి విక్రయిస్తున్నవారికి వ్యాపారం చేసుకునే అనుమతులు కూడా లేవని, వీరి ముఠాలో మరెంత మంది ఉన్నారనే కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నారు. దర్యాప్తు కొనసాగుతోందని. మరింత సమాచారం త్వరలోనే వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు. 100 కుల్ఫీ, 72 బర్ఫీ స్వీట్లు, సిల్వర్ కోటెడ్ బాల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. కుల్ఫీ, ఐస్ క్రీమ్ విక్రయించే సత్యనారాయణ సింగ్ గంజాయితో వీటిని తయారు చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి,

2లో..

# తెలంగాణలో ఒకటో తరగతి నుంచి ఏఐ బోధన

## - 13 బడుల్లో పైలట్ ప్రాజెక్టు అమలు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ఒకటో తరగతి నుంచి అర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ ద్వారా బోధించాలని నిర్ణయించింది. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఈ బోధన చేపట్టనున్నారు. మారుతున్న టెక్నాలజీని అందిపుకొచ్చుని విద్యలో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది. 15వ తేదీ నుంచి నాగర్‌కర్నూల్ జిల్లాలోని 13 పాఠశాలలను ఎంపిక చేసి ఈ ఏఐతో పాఠాలు బోధించబోతున్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని పది మండలాల్లో 13 పాఠశాలలను ఈ ఏఐ సాఫ్ట్‌వేర్‌తో బోధించేందుకు

2లో..

# ప్రపంచస్థాయి రాజధానిగా అమరావతి

## - 5 జిల్లాల్లో 121 గ్రామాల మీదుగా అమరావతి ఓఆర్ఆర్



అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీ ప్రభుత్వం మరో భారీ ప్రాజెక్టుకు సంకల్పించింది. అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనకు అనుగుణంగా భారీ స్థాయిలో అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. అమరావతి ఓఆర్ఆర్ మొత్తం 189.9 కిలోమీటర్ల పొడవు ఉండనుంది. తెలంగాణలోని హైదరాబాద్ ఓఆర్ఆర్ కంటే ఇది ఎక్కువ పొడవు అని తెలిసిందే. అమరావతి ఓఆర్ఆర్ భూ సేకరణకు అధికారులను నియమించి, మరోవైపు ఎన్ హెచ్ ఏఐ ప్రతిపాదిత ఎలైన్ మెంట్లో ఏపీ ప్రభుత్వం మార్పులు చేర్పులతో ఆమోదం తెలపనుంది. పల్నాడు, గుంటూరుతో పాటు ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో భూ సేకరణకు జేసీలను అధికారులుగా నియమించారు. ఐదు జిల్లాల్లోని 23 మండలాల్లో, 121 గ్రామాల మీదుగా ఈ ఓఆర్ఆర్ నిర్మాణం జరగనుంది. అమరావతి ఓఆర్ఆర్ ఏ జిల్లాల్లో ఏ గ్రామాల నుంచి వెళ్ళుందని స్థానిక ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. ఆ జిల్లాలు, మండలాలు, గ్రామాల వివరాలిలా ఉన్నాయి.

### - గుంటూరు జిల్లాలో అమరావతి ఓఆర్ఆర్ వెళ్లే ప్రాంతాలు

- మంగళగిరి మండలంలో కాజ, చినకాకాని
- గుంటూరు తూర్పు మండలంలో గుంటూరు, బుడంపాడు, ఏటుకూరు,
- గుంటూరు పశ్చిమ

2లో..

# ఇటు కేసీఆర్.. అటు జగన్

28 మిగిలారు. కేసీఆర్‌కు ప్రధాన ప్రతిపక్ష నేత హోదా ఉంది. సభలోకి వచ్చి కేసీఆర్ మాట్లాడాలని అటు అధికార పార్టీ నేతలు కూడా కోరుకుంటుంటే, తమ నేత సభకు వస్తే కాంగ్రెస్‌కు వణుకు పుడుతుందనే ధీమాతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేసీఆర్ రాక కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డికి మాజీ సీఎం కేసీఆర్‌కు మధ్య వ్యక్తి గత విభేదాలు లేవు. గతంలో రేవంత్‌ను జైలులో ఉంచినా, ఆ కేసులు విచారణలు వేరని చెప్పాలి. బీఆర్ఎస్ హయాంలో తీసుకొన్న నిర్ణయాలు జరిగిన తప్పులపై చట్టపరంగా విచారణకు, చర్యలకు రేవంత్ ప్రభుత్వం కూడా సిద్ధమవుతోంది. సభకు కేసీఆర్ హాజరయితే విధాన పరంగానే చర్చలు సాగే వీలుంది. కేసీఆర్‌కు అండగా కేటీఆర్, హరీష్ రావులాంటి వారు గళం విప్పడానికీ రెడీగా ఉన్నారు. కేసీఆర్ సభకు వచ్చి తగిన సలహాలు ఇస్తే స్వీకరిస్తామని సీఎం రేవంత్, మంత్రులు అంటున్నారు కూడా. అటు కేసీఆర్ కూడా ప్రభుత్వం మంచి చేస్తే ఆహ్వానించాలని, తప్పులను ఎత్తిచూపాలని తమ పార్టీ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. స్వతహాగా మంచి వక్త అయిన కేసీఆర్ విపక్ష నేతగా సభకు వచ్చి ఏమి మాట్లాడతారన్నది ప్రజలలో ఆసక్తిని రేకెత్తించే అంశంగా మారింది. అటు ఆంధ్రప్రదేశ్ లో రాజకీయ పరిస్థితులు వేరుగా వున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో జగన్ పార్టీ వైసీపీ 11 సీట్లకే పరిమితమైంది. 11 మంది ఎమ్మెల్యేలు ఉన్నటువంటి పార్టీకి ప్రతిపక్ష హోదా ఇవ్వలేమని ఏపీ అసెంబ్లీ స్పీకర్ తెగేసి చెబుతున్నారు. అయితే సీట్ల సంఖ్యతో సంబంధం లేకుండా తనకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలని అప్పుడే సభలో మాట్లాడే సమయం దొరుకుతుందని జగన్ వాదన. అసెంబ్లీకి జగన్ వెళ్లకపోతే పార్టీ పరంగా సరిగా ప్రజల గొంతు వినిపించే ఎమ్మెల్యే లేకపోతే సమస్యలను, ప్రభుత్వ వైఫల్యాలను ఎలా ఎత్తి చూపుతారు. అసెంబ్లీ సమావేశాలంటేనే ప్రభుత్వం భయపడేవిగా ఉండాలి. ప్రతిపక్షం ఎలా నిలదీస్తుందోనన్న సందేహం అధికార పక్షంలో ఉండాలి.అయితే, జగన్ సభకు హాజరు కాలేకపోవడానికి గతంలో అధికార పక్షంగా వైసీపీ సభలో అనుసరించిన వైఖరి ఇప్పుడు ప్రతిబంధకంగా మారుతోంది. అప్పుడు 23 మంది సభ్యులే ఉన్నా చంద్రబాబు హుందాగా సభకు హాజరయ్యారు. అయితే వ్యక్తిగత దూషణలు, అవమానాలు శృతిమించి, సభకు రానని గెలిచే వస్తానని శపథం చేసి నెరవేర్చుకున్నారు. ఇప్పుడు సభకు హాజరైతే అవమానాల పాలౌతానన్న భయం జగన్‌లో కనబడుతుంది. అటు అధికార పక్ష సభ్యులు కూడా జగన్ ఎప్పుడొస్తాడా, ఆడుకుందామన్న రీతిలో ఎదురు చూస్తున్నారు. ప్రతిపక్ష హోదా లేదు, పార్టీకి బలం లేదని సంకోచించకుండా జగన్ అసెంబ్లీకి హాజరై తేల్చుకోవాలని కొందరు సూచిస్తున్నారు. వాగ్ధాటి వున్న వెంకయ్యనాయుడు, జైపాల్ రెడ్డిలాంటి వారు ఏ ప్రతిపక్ష హోదా వుందని రాణించారని మరికొందరు ప్రశ్నిస్తున్నారు. సభలో అవమాన పడితే ప్రజలలో తేల్చుకోవాలని వారి ఆశీర్వాదాలు పొందాలని జగన్‌కు సూచిస్తున్నారు. ఏద్కెనా 8 నెలల తరువాత కేసీఆర్ అసెంబ్లీకి హాజరు కావడం, అక్కడ జగన్ కూడా సుదీర్ఘ కాలం తర్వాత ఒక్కరోజు హాజరుకావడం చర్చకు తావిచ్చింది. వరుసగా 60 రోజులు సభకు హాజరుకాకుంటే అనర్హత వేటు పడుతుంది. కాబట్టి, దానినుండి తప్పించు కోవడానికి వీరిద్దరూ సభకు అటెండెన్స్ కోసం హాజరయ్యారనే వాదనా వినిపిస్తోంది. ఏద్కెనా కేసీఆర్, జగన్ మధ్య పోలిక చేయలేమన్నది నిజం. ఇకన్కెనా వీరిద్దరూ సభకు హాజరై ప్రజల తరుపున గళం విప్పుతారేమో చూడాలి. కేసీఆర్ మాటేమో కానీ, జగన్ మాత్రం అసెంబ్లీకి వచ్చే సూచనలు కన్పించడం లేదు. అయితే కేసీఆర్ మాత్రం తాను హాజరైనా, కాకున్నా పార్టీ ఎమ్మెల్యేలు సభలో గట్టిగా ఎలా నడుచుకోవాలో వ్యూహం మాత్రం రచిస్తునే ఉన్నారు.

## పోక్సో కేసులో యడియూరప్పకు స్వల్ప ఊరట

ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఇచ్చిన సమన్లను తాజాగా కర్ణాటక హైకోర్టు నిలిపివేసింది. ఓ మహిళ తన 17 ఏళ్ల కుమార్తెతో కలిసి బెంగళూరు నగరంలోని డాలర్స్ కాలనీలో ఉన్న యడియూరప్ప ఇంటికి వెళ్లగా ఆయన తన కుమార్తెను లైంగికంగా వేధించారని గతేడాది మార్చి 14వ తేదీన ఆ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే ఒక మోసం కేసులో తనకు సాయం చేయాలంటూ బాధితురాలు, ఆమె తల్లి గత ఏడాది ఫిబ్రవరి 2వ తేదీన యడియూరప్పను కలిశారు. అయితే ఆ సమయంలోనే తన కుమార్తెను యడియూరప్ప బలవంతంగా గదిలోకి లాక్కెళ్లి లైంగిక దాడి చేశారని బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు యడియూరప్పపై పోక్సో కేసు నమోదు చేశారు. అయితే తనపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలను యడియూరప్ప ఆఫీస్ తీవ్రంగా ఖండించింది. అంతేకాకుండా ఈ పోక్సో కేసు నమోదు చేసిన మహిళ గతంలోనూ పలువురిపై ఇలాంటి ఆరోపణలే చేశారని తెలిపింది. అయితే ఇటీవల తనపై నమోదైన పోక్సో కేసును కొట్టివేయాలని యడియూరప్ప కర్ణాటక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా అక్కడ ఎదురుదెబ్బ తగిలింది. బాలికపై దాఖలైన లైంగిక వేధింపుల అంశంలో పోక్సో కేసును కొట్టివేయడానికి హైకోర్టు నిరాకరించింది. ఈ క్రమంలోనే ఆ కేసును తిరిగి ట్రయల్ కోర్టుకు పంపించింది. ఈ నేపథ్యంలోనే ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఇక ఈ కేసును వాపస్ తీసుకునేందుకు తనకు యడియూరప్ప డబ్బు ఆశ చూపించారని బాలిక తల్లి ఆరోపించింది. ఈ ఆరోపణలను యడియూరప్ప తరఫు లాయర్ కూడా తోసిపుచ్చారు. గతంలో మరో వ్యక్తి అదే బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఆ కేసులో సహాయం కోసం వారిద్దరు యడియూరప్పను కలిసినట్లు ఆయన కోర్టుకు వెల్లడించారు. అయితే ఈ వాదనలను ప్రాసిక్యూషన్ తిప్పికొట్టింది. బాలికను యడియూరప్ప లైంగికంగా వేధించారని చెప్పేందుకు అన్ని ఆధారాలు ఉన్నాయని తెలిపింది. బాలికపై లైంగిక వేధింపులు హేయమైన చర్య అని ప్రాసిక్యూషన్ చెప్పింది.

## రాజాసింగ్ వ్యాఖ్యలతో రేవంత్ రెడ్డి దొరికిపోయారు

రేవంత్ రెడ్డి రహస్య సమావేశాలా సిగ్గు సిగ్గు.!" అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి అధికారిక సమావేశాలు నిర్వహించాలి కానీ ఈ చీకటి సమావేశాలు పెట్టడమేమిటని ప్రశ్నించారు. ఇలాంటి దిక్కుమాలిన చిల్లర రాజకీయాలు తెలంగాణ నేలపై ఇంత వరకు ఎప్పుడూ చూడలేదని పేర్కొన్నారు. ఒకవైపు బయటకు బీజేపీ నేతలతో కుస్తీపడుతున్నట్లు పోజులు కొట్టి, దొంగచాటుగా దోస్తీ చేసే ఈ నీచ సంస్కృతికి తెరలేపడం అత్యంత దుర్మార్గమని అన్నారు. ఏ గూడుపుఠాణి చేయడానికి ఈ తెరచాటు సమావేశాలు నిర్వహిస్తున్నారో దమ్ముంటే ముఖ్యమంత్రి బయటపెట్టాలని కేటీఆర్ నిలదీశారు. పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా, గురుకులాల్లో విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నా, ఒక్క సమీక్ష నిర్వహించే సమయం లేని ముఖ్యమంత్రికి, ఈ రహస్య సమావేశాలకు మాత్రం సమయం దొరకడం క్షమించలేని ద్రోహమని అన్నారు. అట్టర్ ఫ్లాప్ ముఖ్యమంత్రిగా ముద్రపడి, ఇక ఏ క్షణంలోనైనా తన సీఎం కుర్చీ చేజారే సూచనలు కనిపించడం వల్లే ముఖ్యమంత్రి బీజేపీతో ఈ చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నట్లు స్పష్టమవుతోందని అన్నారు. ఏడాదిన్నరలో రాష్ట్రాన్ని ఆగంచేసి, డర్టీ పాలిటిక్స్ చేస్తున్న ఈ రాబందు రాజకీయాలను తెలంగాణ సమాజం మాత్రం ఎట్టి పరిస్థితుల్లో సహించదని పేర్కొన్నారు. రెండు ఢిల్లీ పార్టీలకు తెలంగాణ సమాజం కర్రు కాల్చి వాతపెడుతుందని ఆయన పేర్కొన్నారు.

# హనీ ట్రాప్ వలలో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగి

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత్ నుంచి కీలక రహస్యాలు ఆర్మీ, రక్షణ రంగానికి చెందిన సమాచారాన్ని సేకరించేందుకు దాయాది పాకిస్తాన్ అనేక ఎత్తులు వేస్తూ ఉంటుంది. పాకిస్తాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ భారత్‌లోని పలువురికి మహిళలను ఎరగా వేసి వారి దగ్గరి నుంచి సున్నితమైన సమాచారాన్ని సేకరిస్తూనే ఉంది. ఇప్పటివరకు ఎంతో మంది ఇలా దొరికిపోగా తాజాగా మరోసారి ఇలాంటి హనీ ట్రాప్ సంఘటన వెలుగులోకి వచ్చింది. పాక్ ఐఎస్ఐ కోసం పనిచేస్తున్న ఓ అమ్మాయి వలపు వలలో పడిన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగి మిలిటరీ రహస్యాలను లీక్ చేయడం ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. ఆ వ్యక్తితోపాటు అతడి ఫ్రెండ్‌ను కూడా తాజాగా ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు అరెస్ట్ చేశారు. పాక్ ఐఎస్ఐకు గూఢచర్యం చేస్తూ భారత రక్షణ రంగానికి చెందిన రహస్య సమాచారాన్ని శత్రువులకు చేరవేస్తున్నాడన్న ఆరోపణలపై ఉత్తర్‌ప్రదేశ్‌లో రవీంద్ర కుమార్ అనే వ్యక్తిని స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. పాక్ ఏజెంట్ హనీ ట్రాప్‌లో పడిన రవీంద్ర కుమార్ భారత సైన్యం, ఆయుధాలకు సంబంధించిన కీలక డేటాతో పాటు గగన్‌యాన్ ప్రాజెక్ట్ వివరాలను కూడా పాక్‌కు చేరవేసినట్లు విచారణలో తేలింది. ఫిరోజాబాద్‌లోని హజ్రత్‌పూర్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో మెకానిక్‌గా పనిచేస్తున్న రవీంద్ర కుమార్‌కు గతేడాది నేహా శర్మ అనే మహిళ ఫేస్‌బుక్‌లో పరిచయం అయింది. పాక్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ కోసం పనిచేస్తున్న నేహా శర్మ రవీంద్ర కుమార్‌తో స్నేహం చేసి డబ్బులు ఆశ చూపించి మిలిటరీ రహస్యాలను సంపాదించినట్లు పోలీసుల పేర్కొన్నారు. అయితే రవీంద్ర కుమార్ నేహా శర్మ ఫోన్ నంబర్‌ను చంద్రన్ స్టోర్‌కీపర్ పేరుతో సేవ్ చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. అంతేకాకుండా వాట్సాప్‌లో ఆమెకు అనేక కీలక డాక్యుమెంట్లు పంపించినట్లు తేల్చారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, 51 గోరా? రైఫిల్స్ రెజిమెంట్ అధికారులు చేపట్టిన లాజిస్టిక్స్ డ్రోన్ టెస్ట్‌లు, రోజువారీ ప్రొడక్షన్ డేటా, స్క్రీనింగ్ కమిటీ పంపిన రహస్య లేఖలను సంపాదించి పంపించినట్లు తెలిసింది. ఇక ఈ డేటాలో ఇస్రో చేపడుతున్న కీలక ప్రాజెక్ట్ అయిన గగన్‌యాన్ వివరాలు కూడా ఉన్నాయని పోలీసులు చెప్పడం ఇప్పుడు సంచలనంగా మారింది. ఇక రవీంద్ర కుమార్ కేవలం నేహా శర్మతో మాత్రమే కాకుండా పాక్ కేంద్రంగా పనిచేస్తోన్న ఐఎస్ఐ సభ్యులతోనూ నేరుగా కాంటాక్ట్‌లో ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. భారత రక్షణ రంగ ప్రాజెక్టులకు సంబంధించిన నిఘా సమాచారాన్ని రవీంద్ర కుమార్ పాక్ ఐఎస్ఐకి పంపించి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రవీంద్ర కుమార్‌తోపాటు అతడి ఫ్రెండ్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వాట్సాప్ చాట్‌లను తనిఖీ చేస్తున్నారు.

# అన్నీ ఒక్కడినై పోరాటం చేశా

**పిఠాపురంలో జరిగిన జనసేన ప్లీనరీలో జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గూజ్‌బంప్స్ తెప్పించి స్పీచ్ ఇచ్చారు. ఆయన ప్రసంగిస్తున్న టైంలో ప్లీనరీ ప్రాంగణమంతా మారుమోగిపోయింది.**

పిఠాపురం (ప్రశ్న న్యూస్) ఓడినా అడుగు ముందుకే వేశామని జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడలో ఏర్పాటు చేసిన "జయ కేతనం" సభలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. తన ప్రయాణంలో ఎన్ని ఆటంకాలు వచ్చినా వెనకడుగు వేయలేదని చెప్పారు. అన్నీ ఒక్కడినై పోరాటం చేశానని, మనం నిలబడి పార్టీని నిలబెట్టామని అన్నారు.మనం ఓడినప్పుడు మీసాలు మెలేశారని, జబ్బలు చరిచారన్న పవన్, తామే నాలుగు దశాబ్దాల టీడీపీని కూడా నిలబెట్టామని తెలిపారు. మన కార్యకర్తలను, వీరమహిళలను అనేక బాధలు పెట్టారని, తనను అణచివేసేందుకు అనేక కుట్రలు చేశారని పేర్కొన్నారు. అసెంబ్లీ గేటును తాకనివ్వం అని ఛాలెంజ్ చేశారని, వాళ్ల ఛాలెంజ్‌లు సవాలుగా తీసుకుని పోరాడామని గుర్తు చేశారు. దేశమంతా మనవైపు చూసేలా వందశాతం స్ట్రైక్‌రేట్‌తో విజయం సాధించామని చెప్పారు. దాశరథి సాహిత్యం చదివి ప్రభావితం అయ్యానని వెల్లడించారు. రుద్రవీణ వాయిస్తా, అగ్నిధారలు కురిపిస్తా అనే మాటలు నిజం చేశామని పవన్ కల్యాణ్ అన్నారు.దాష్టీక ప్రభుత్వాన్ని దించి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారని తెలిపారు. జనసేన జన్మస్థలం తెలంగాణ, కర్మస్థానం ఆంధ్రప్రదేశ్ అని పవన్ పేర్కొన్నారు. నా తెలంగాణ కోటి రతనాల వీణ అని పవన్ కల్యాణ్ అన్నారు. కరెంట్‌షాక్ కొట్టి చావుబతుకుల్లో ఉంటే కొండగట్టు అంజన్న ప్రాణం పోశాడని చెప్పుకొచ్చారు. జనసేన వీరమహిళలు రాణిరుద్రమలు అని, తేడా వస్తే కాల్చి ఖతం చేసే లేజర్ బీమ్‌లని పవన్ కల్యాణ్ కొనియాడారు. తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటకలోనూ రాజకీయపరంగా జనసేనకు అభిమానులున్నారన్న పవన్, తమిళులు తన తెలుగు ప్రసంగాలు వింటున్నారని తెలిసిందన్నారు. తమిళులు తనపై చూపుతున్న ప్రేమకు కృతజ్ఞుడిని అని అన్నారు. ఈ సందర్భంగా హిందీ, తమిళం, మరాఠీ, కన్నడ, ఆంగ్ల భాషల్లో పవన్ కల్యాణ్ ప్రసంగించారు.అనేక ఇబ్బందులు పడి 11 ఏళ్లుగా పార్టీని నడిపానన్న పవన్ కల్యాణ్, తాను రాజకీయాల్లోకి వచ్చేందుకు సినిమా సాధనం మాత్రమేనని చెప్పారు. ఖుషి సినిమా చూసి గద్దర్ తనను ఎంతగానో ప్రోత్సహించారని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా గజ్జెకట్టి ప్రజలను ప్రభావితం చేసిన గద్దర్ అన్నకు నివాళులు అంటూ పేర్కొన్నారు. సెంట్రల్ వర్సిటీ ప్రొఫెసర్ శ్రీపతి రాముడు తనను ఎంతో ప్రభావితం చేశారని తెలిపారు. వేదికపై ప్రొఫెసర్ శ్రీపతి రాముడును పవన్ కల్యాణ్ సత్కరించారు. మనదేశానికి బహుభాషలే మంచిదని పవన్ అన్నారు. తమిళనాడు సహా అన్ని రాష్ట్రాలకు ఒకే సిద్ధాంతం ఉండాలని చెప్పారు.జనసేన పార్టీకి 11వ సంవత్సరంని వైఎస్సార్సీపీ 11 సీట్లకు అంకితం చేశామని ఎద్దేవా చేశారు. తాను డిగ్రీ చేసి ఎస్ఐను కావాలని తన నాన్న అనేవారని గుర్తు చేసుకున్నారు. పోలీసులకు స్వయం నిర్ణయాధికారం ఉండదని, విధుల నిర్వహణే ఉంటుందని పవన్ అన్నారు. సగటు మధ్యతరగతి మనిషిగా బతకడమే తన కోరిక అని చెప్పారు. చంటి సినిమాలో మీనాను పెంచినట్లు తమ ఇంట్లో తనను పెంచారన్న పవన్, బయటకు వెళ్తే ఏమవుతానో అని నిత్యం భయపడేవారని చెప్పుకొచ్చారు. సినిమాల్లోకి, రాజకీయాల్లోకి వస్తానని తానెప్పుడూ అనుకోలేదన్న పవన్, తన నాన్న చిన్నప్పుడు ఎంతో క్రమశిక్షణతో పెంచారని గుర్తు చేసుకున్నారు. కోట్లమందికి సేవ చేసేందుకు అవకాశం ఇచ్చింది ఆ భగవంతుడే అని, సినిమాల్లోనూ దేశభక్తి ఉండాలని తపించేవాడినన్నారు. ఎంతో ఆలోచించి జనసేనకు ఏడు సిద్ధాంతాలు పెట్టామని, సమాజంలో రుగ్మతలు బాగుచేశాడనే చేగవేరా తన కిష్టమన్నారు. భిన్నమైన వ్యక్తుల్లో ఏకత్వం చూడగలగడమే తన ఐడియాలజీ అని పవన్ అన్నారు.చిన్నప్పటి నుంచి పుస్తకాలు చదవడం ఆపలేదని, ఏమీ తెలియకుండానే పార్టీ పెడతామా, 11 ఏళ్లు నడుపుతామా అని అన్నారు. సమాజంపై అవగాహన లేకుండానే పార్టీ పెట్టేస్తామా అని ప్రశ్నించారు. రాజకీయాల్లో ఉండేందుకు సైద్ధాంతిక విధానాన్నే ఎంచుకున్నానని పవన్ చెప్పారు. సమాజంలో మార్పు కోసం వచ్చానని, ఓట్ల కోసం కాదని స్పష్టం చేశారు. ఎంత పోరాటం చేస్తే ఇక్కడివరకు వచ్చామో అర్థం చేసుకోవాలన్నారు. ప్రవర్తన, ఆలోచనా విధానం మేరకే వ్యక్తి జీవితం ఉంటుందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. తన వ్యక్తిగత విషయాలతో ఏం పని అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. అన్యాయం జరిగినప్పుడు ప్రతి ఒక్కరికీ కోపం రావాలన్న పవన్, తనకు ఒక్కడికి కోపం వస్తేనే ఇంత జరిగిందని, అందరికీ కోపం వస్తే సమాజంలో ఎంత మార్పు వస్తుందో ఊహించాలన్నారు. పిల్లలకు పుస్తకాల భారం తగ్గించాలని కోరుకునే వాడిని తానని, గిరిజనుల దాహార్తి తీర్చాలని కోరుకున్నానన్నారు. గిరిజన ప్రాంతాలకు రోడ్లు వేయించామని, డోలీ మోతలు లేకుండా చేశామని వెల్లడించారు.బలమైన దేశం కావాలంటే బలమైన ప్రజలు ఉండాలని పవన్ కల్యాణ్ తెలిపారు. అదే విధంగా బలమైన దేశం కావాలంటే బలమైన నాయకత్వం ఉండాలన్నారు. దేశం కోసం బలంగా నిలబడే యువత ఉంటేనే దేశం మారుతుందని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తును నిర్మించే యువనాయకత్వం రావాలని పిలుపునిచ్చారు. ఒక్కడిని తలచుకుంటేనే అనేకమంది నాయకులు వచ్చారన్న పవన్, విదేశాలకు వెళ్లే పరిస్థితి మనకు రాకూడదని అన్నారు. ప్రతి ఊరి నుంచి వందమంది యువత ముందుకు రావాలన్న పవన్, చదువు, ఉద్యోగం దేనికోసమైనా మన యువత విదేశాలకు వెళ్లకూడదని పేర్కొన్నారు. సనాతన ధర్మం నా రక్తంలోనే ఉందని, నిరూపించుకోవాల్సిన అవసరం లేదని పవన్ కల్యాణ్ అన్నారు. 14 ఏళ్ల వయసు నుంచే నేను ఏటా దీక్ష చేసేవాడినని, సనాతన ధర్మం గురించి ఎవరూ సర్టిఫికెట్లు ఇవ్వాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. 219 ఆలయాల్లో దారుణాలు జరిగినా తాను ఆందోళనకు దిగలేదని, ప్రవక్త, అల్లా, క్రీస్తు, మేరీమాతను దూషించగలరా అని ప్రశ్నించారు. రాముడు, శివుడు, పార్వతీ, అయ్యప్పను దూషిస్తే ఊరుకోవాలా అని అడిగారు. మతానికి ఒక న్యాయం కుదరదని, అందరికీ ధర్మం ఒకటే అని స్పష్టం చేశారు. మన పాలకులు మసీదులు, చర్చిలు కట్టించారని అన్నారు. పాకిస్థాన్ మొదటి న్యాయశాఖ మంత్రి భారత్‌కు కాందిశీకుడిగా వచ్చారని పవన్ కల్యాణ్ గుర్తు చేశారు. ఇప్పుడు పాకిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి హిందువులు ఎందుకు పారిపోతున్నారని ప్రశ్నించారు. మనదేశంలో ముస్లింలను గౌరవిస్తామని, ఆదరిస్తామని అన్నారు. ఇతర మతాలను గౌరవించాలని సనాతన ధర్మం తమకు నేర్పిందన్న పవన్, సెక్యులరిజం అంటే ఏమిటో అర్థం చేసుకోవాలన్నారు. తప్పును తప్పని గట్టిగా చెప్పండని, మతాల ప్రస్తావన వద్దని సూచించారు. భారతదేశం కోసం చనిపోయేందుకు సిద్ధంగా ఉన్నానని సంచలన వ్యాఖ్యలు చేశారు.సంస్కృతం, హిందీ మన భాషలే కదా అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. తమిళనాడులో హిందీ వద్దంటున్నారని, తమిళ సినిమాలను హిందీలోకి కూడా డబ్ చేయకండని అన్నారు. అక్కడ పనిచేసేవాళ్లు బిహార్ నుంచి రావాలి, హిందీ మాత్రం వద్దా అని మండిపడ్డారు. మనదేశంలోని భాషలనే ద్వేషించడం అవివేకమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తరాది, దక్షిణాది భేదాలు కాదని, దేశ సమగ్రతను కాపాడాలని పిలుపునిచ్చారు. హిందీని వ్యతిరేకిస్తూ తమిళనాడు చేసిన చర్యలు తప్పు అని, విధ్వంసం చేయడం తేలిక అని, నిర్మించడమే కష్టమన్నారు. దేశానికి పనికివచ్చే పార్టీని జాగ్రత్తగా చూసుకోవాలని, రక్షించుకోవాలని పవన్ కల్యాణ్ చెప్పారు.

## తెలంగాణలో ఒకటో తరగతి నుంచి ఏఐ బోధన

ఎంపిక చేశారు. పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టే ఈ ఏఐ బోధన విజయవంతం అయితే దీన్ని రాష్ట్రవ్యాప్తంగా స్కూల్స్‌కు అప్లై చేయనున్నారు. ఇప్పటికే ఆయా స్కూల్స్‌లో ఏర్పాట్లు పూర్తి చేశారు. దాదాపు 1200 మంది పిల్లలకు ఏఐ విద్య నేర్పిస్తారు. దీని కోసం ఒక్కో స్కూల్‌కి పది వరకు కంప్యూటర్లు పంపిణీ చేశారు. ఆయా పాఠశాలలో ఉన్న విద్యార్థులను బట్టి వారికి డెస్క్‌టాప్‌లు సరఫరా చేశారు. 13 బడులకు 70కిపైగా కంప్యూటర్లు ఇతర ఎక్ససిరీస్ అందజేశారు.

### - నాగర్‌కర్నూల్ జిల్లాలో ఏఐ బోధనకు ఎంపికైన పాఠశాలలు ఇవే

1. వట్టెం ప్రాథమిక పాఠశాల(బిజినపల్లి మండలం) 2. జూపల్లి ప్రాథమిక పాఠశాల(చారగొండ మండలం) 3. కొండ్రావుపల్లి ప్రాథమిక పాఠశాల(కోడేరు మండలం) 4. ఎల్లూరు ప్రాథమిక పాఠశాల(కొల్లాపూర్ మండలం)5. ఎన్మనబెట్ల ప్రాథమిక పాఠశాల(కొల్లాపూర్ మండలం)
6. గంద్రావుపల్లి ప్రాథమిక పాఠశాల(పెద్దకొత్తపల్లి మండలం)7. చంద్రకల్ ప్రాథమిక పాఠశాల(పెద్దకొత్తపల్లి మండలం) 8. కొండూరు ప్రాథమిక పాఠశాల(పెంట్లవెల్లి మండలం)
9. ఐతోల్ ప్రాథమిక పాఠశాల(తాడూరు మండలం)
10. ఆలేరు ప్రాథమిక పాఠశాల(తెలకపల్లి మండలం)
11. మారేపల్లి ప్రాథమిక పాఠశాల(తిమ్మాజిపేట మండలం)
12. చేగుంట ప్రాథమిక పాఠశాల(తిమ్మాజిపేట మండలం)
13. వంగూర్ ప్రాథమిక పాఠశాలను (వంగూరు మండలం)

విద్యార్థులను గ్రూప్‌గా చేసి ఏఐ ద్వారా బోధిస్తారు. వాళ్ల సిలబస్‌లో ఉన్న పాఠాలనే ఈ కోర్సులో చేర్చారు. వాళ్లకు అర్థమయ్యే సరళమైన భాషలో నేర్పిస్తారు. వాళ్లకు అర్థం కాకుంటే ఇంకా మరింత సులభంగా నేర్పించనున్నారు. భిన్నమైన వెర్షన్స్‌లో పిల్లలకు ఈ కోర్సు అందిస్తారు. ఈకే-స్టెప్ అనే కంపెనీ తయారు చేసిన సాఫ్ట్‌వేర్‌తోనే ఈ బోధన చేపట్టనున్నారు. చాలా పాఠశాలల్లో విద్యార్థులు చదువుల్లో వెనుకబడుతున్నారు. కొందరికి చదవడం, రాయడం రావడం లేదు. మరికొందరు లెక్కల్లో వీక్‌గా ఉంటున్నారు. అలాంటి వారిని ఎంపిక చేసి ఈ ఏఐద్వారా బోధిస్తారు. పాఠాలు పిల్లలకు అర్థమయ్యే ఈజీ లాంగ్వేజ్‌లో ఈ పాఠాలు ఉంటాయి. వీటి ద్వారా చదువులో వెనుకబడిన పిల్లల్లో మార్పు వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.(ప్రాథమిక విద్యా స్థాయిలో ఏఐ ఆధారిత టూల్స్ ఉపయోగించి విద్యార్థుల్లో రాసే, చదివే స్కిల్స్‌ను మెరుగుపరచనున్నారు. వారిలో చిన్న చిన్న లెక్కలు చేసుకునేలా అవగాహన కల్పించనున్నారు. కాస్త మెరుగ్గా ఉన్న విద్యార్థులకు అడ్వాన్స్ విషయాలను నేర్పిస్తారు. వారిలో బలహీనతలు గుర్తించి వాటిని అధిగమించేందుకు చేపట్టాల్సిన చర్యలు కూడా తెలియజేస్తారు. దీని ద్వారా అందరి విద్యార్థలకు లెవల్‌ప్లేయింగ్ ఫీల్డ్ సెట్ చేయనున్నారు. ఇందులో ఉపాధ్యాయులకి కూడా కొన్ని సూచలు సలహాలు ఇవ్వబోతున్నారు. బోధనలో టెక్నాలజీ వాడకంపై వాళ్లకు శిక్షణ ఇస్తారు. విద్యాబోధనలో లెటెస్ట్ టెక్నాలజీ వాడకంపై వివిధ రాష్ట్రాల్లో అమలు అవుతున్న విధానాలపై ప్రభుత్వం స్టడీ చేసింది. ముఖ్యంగా కేరళలో అమలు చేస్తున్న విధానాల గురించి అధ్యయనం చేసింది. అన్ని ప్రాంతాల్లో అమల్లో ఉన్న బెస్ట్ ప్రాక్టీసెస్‌ను అడాప్ట్ చేసుకొని ప్రయోగాత్మకంగా ఇక్కడ అమలు చేయబోతోంది.

# పేర్లను సిఫారసు చేయకుండా ఆలస్యం చేస్తున్నారు

మాట్లాడుతూ, నామినేటెడ్ పదవుల భర్తీకి కసరత్తులు చేస్తున్నామని చెప్పారు. నామినేటెడ్ పదవులకు పేర్లను సిఫారసు చేయకుండా కొంతమంది నేతలు ఆలస్యం చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడిన వారికే నామినేటెడ్ పదవులు ఇస్తున్నాం పార్టీ కోసం శ్రమించిన వారి వివరాలను నేతలు అందజేయాలి అని చంద్రబాబు స్పష్టం చేశారు. సరైన వ్యక్తులను సరైన పదవుల్లో నియమిస్తామని పేర్కొన్నారు. ఏపీ వ్యాప్తంగా 21 ప్రధాన ఆలయాలకు చైర్మన్లను నియమిస్తామని వెల్లడించారు. కాగా, నామినేటెడ్ పదవుల కోసం ఇప్పటివరకు 60 వేల దరఖాస్తులు వచ్చాయని, దరఖాస్తులన్నింటినీ నిశితంగా పరిశీలిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. దరఖాస్తు పంపిన మొదటిసారే పదవి రాలేదని అనుకోవద్దని, రెండేళ్ల పదవీకాలం ముగిశాక మిగతా వారికి అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే నామినేటెడ్ పదవులు తీసుకున్న వారి పనితీరును పర్యవేక్షిస్తున్నామని అన్నారు. నేతలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎంత హుందాగా ఉన్నారో, ఇప్పుడూ అంతే హుందాగా వ్యవహరించాలని సూచించారు. టీడీపీ నేతలు ఏ స్థాయిలోనూ వైసీపీ నేతలతో సంబంధాలు పెట్టుకోకూడదని స్పష్టం చేశారు. నేను ఈ విధంగా చెబుతుంటే వైసీపీకి ఓటేసిన వారికి పథకాలు ఇవ్వొద్దు అన్నట్టుగా ప్రచారం చేస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో వివక్ష ఉండదని ఉద్ఘాటించారు. పార్టీలకు అతీతంగా పథకాలు అందజేస్తున్నామని అన్నారు. సంక్షేమ పథకాలు వేరు, రాజకీయ సంబంధాలు వేరు అని వ్యాఖ్యానించారు. గ్రూపు రాజకీయాలకు తావివ్వకుండా చూసే బాధ్యత మంత్రులదేనని వివరించారు. జిల్లా ఇన్చార్జి మంత్రులు వారి జిల్లాల్లో పర్యటనల సంఖ్య పెంచాలని సూచించారు. కూటమిలోని మూడు పార్టీల నేతలను, కార్యకర్తలను కలుపుకుని ముందుకు వెళ్లాలని తెలిపారు.

# లేఖలు అంగీకరించకుంటే తిరుమలకు వచ్చి తేల్చుకుంటాం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 294 మంది ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలతో వచ్చే వారికి అనుమతి ఇచ్చేవారు. కానీ రాష్ట్ర విభజన నుంచి తిరుమలలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. తిరుమలలో కేవలం ఏపీ ప్రజాప్రతినిధుల సిఫార్సులను మాత్రమే టీటీడీ పరిగణనలోకి తీసుకుంటుంది. తెలంగాణ ప్రజా ప్రతినిధులు ఇచ్చే సిఫార్సులను ఆమోదిస్తామని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సైతం చెప్పారు. లేఖలు ఇవ్వండి, అకామడేషన్ ఇస్తామంటారు. లేఖలు సిఫార్సు చేస్తే పరిగణనలోకి తీసుకోవడం లేదు. మార్చి నెల సగం పూర్తయింది. ఇంకా తెలంగాణ ప్రజా ప్రతినిధుల లేఖలతో వచ్చే వారికి ఎలాంటి అనుమతి, సదుపాయాలు కల్పించడం లేదు. ఇది నిజంగా చాలా బాధాకరం. ఉమ్మడి ఏపీలో 294 మంది సిఫార్సు లేఖలు ఆమోదించిన టీటీడీ.. ఇప్పుడు కేవలం ఏపీ నేతల లేఖల్ని మాత్రమే అనుమతిస్తున్నారు. దీనిపై టీటీడీ మరోసారి ఆలోచన చేయాలి' అని ఎంపీ రఘునందన్ రావు కోరారు.

# హోలీ వేడుకల్లో మత్తు దందా

గంజాయి బర్ఫీ, చాక్లెట్లను స్వాధీనం చేసుకున్న సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి అభినందించారు. కాగా, మత్తు పదార్థాల వినియోగం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. హైదరాబాద్ నగరంలో గంజాయి విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు పోలీసులు, ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకుంటున్నాయని చెప్పారు. ఎవరైనా అనుమానాస్పదంగా వ్యాపారం నిర్వహిస్తున్నట్లు అనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ప్రపంచస్థాయి రాజధానిగా అమరావతి మండలంలో పొత్తూరు, అంకిరెడ్డిపాలెం

- మేడికొండూరు మండలంలో సిరిపురం, వరగాని, వెలవర్తిపాడు, మేడికొండూరు, డోకిపర్రు, విశదల, పేరేచర్ల, మందపాడు, మంగళగిరిపాడు,
- తాడికొండ మండలంలో పాములపాడు, రావెల
- దుగ్గిరాల మండలంలో చిలువూరు, ఈమని, చింతలపూడి, పెనుమూలి, కంఠంరాజు కొండూరు,
- పెదకాకాని మండలంలో నంబూరు, అనుమర్లపూడి, దేవరాయబొట్లపాలెం,
- తెనాలి మండలంలో కొలకలూరు, నందివెలుగు, గుడివాడ, అంగలకుదురు, కఠేవరం, సంగం జాగర్లమూడి
- కొల్లిపర మండలంలో వల్లభాపురం, మున్నంగి, దంతలూరు, కుంచవరం, అత్తోట
- చేబ్రోలు మండలంలో గొడవర్రు, నారాకోడూరు, వేజెండ్ల, సుద్దపల్లి, శేకూరు
- వట్టిచెరుకూరు మండలంలో కొర్నెపాడు, అనంతవరప్పాడు, చమళ్లమూడి, కుర్నూతల
- పల్నాడు జిల్లాలో ఓఆర్ఆర్ వెళ్లే ప్రాంతాలు..
- పెదకూరపాడు మండలంలో ముస్సాపురం, పాటిబండ్ల, తాళ్లూరు, లింగంగుంట్ల, జలాల్పురం, కంభంపాడు, కాశిపాడు
- అమరావతి మండలంలోని ధరణికోట, లింగాపురం, దిడుగు, నెమలికల్లు
- ఎన్టీఆర్ జిల్లాలో ఓఆర్ఆర్ వెళ్లే ప్రాంతాలు..
- వీరులపాడు మండలంలోని పొన్నవరం, జగన్నాథపురం, తిమ్మాపురం, గూడెం మాధవరం, జుజ్జూరు, చెన్నారావుపాలెం, అల్లూరు, నరసింహారావు పాలెం
- కంచికచర్ల మండలంలోని కంచికచర్ల, మున్నలూరు, మొగులూరు, పెరెకలపాడు, గొట్టుముక్కల, కునికినపాడు
- జి.కొండూరు మండలంలోని జి.కొండూరు, దుగ్గిరాలపాడు, పెట్రంపాడు, కుంటముక్కల, గంగినేనిపాలెం, కోడూరు, నందిగామ,
- మైలవరం మండలంలోని మైలవరం, పొందుగుల, గణపవరం

### - కృష్ణా జిల్లాలో ఓఆర్ఆర్ వెళ్లే ప్రాంతాలు..

- గన్నవరం మండలంలోని సగ్గురు ఆమని, బుతుమిల్లిపాడు, బల్లిపర్రు
- బాపులపాడు మండలంలోని బండారుగూడెం, అంపాపురం
- ఉంగుటూరు మండలంలోని పెద్దఅవుటపల్లి, తేలప్రోలు, వెలినూతల, ఆత్కూరు, పొట్టిపాడు, వెల్దిపాడు, తరిగొప్పుల, బొకినాల, మానికొండ, వేంపాడు
- కంకిపాడు మండలంలోని మారేడుమాక, కొణతనపాడు, దావులూరు, కోలవెన్ను, ప్రొద్దుటూరు, చలివేంద్రపాలెం, నెప్పల్లె, కుందేరు
- తోట్లవల్లూరు మండలంలోని రొయ్యూరు, నార్త్ వల్లూరు, చినపులిపాక, బొడ్డపాడు, సౌత్ వల్లూరు

### - ఏలూరు జిల్లాలో ఓఆర్ఆర్ వెళ్లే ప్రాంతాలు..

- ఆగిరిపల్లి మండలంలోని బొడ్డనపల్లె, గరికపాటివారి కండ్రిక, ఆగిరిపల్లి, చొప్పరమెట్ల, పిన్నమరెడ్డిపల్లి, నూగొండపల్లి, నరసింగపాలెం, కృష్ణవరం, సగ్గూరు, సురవరం, కల్లటూరు.

# మార్చిలోనే మండుతోన్న ఎండలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ఉష్ణోగ్రతలు మార్చి నెలలోనే 40 డిగ్రీల పైకి చేరుకున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. సాధారణం కంటే 3.3 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయని వెల్లడించింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయని తెలిపింది. రానున్న రెండు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు పైగా నమోదయ్యే అవకాశముందని తెలిపింది. హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో 39 డిగ్రీలు నమోదవుతున్నట్లు వెల్లడించింది. ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లో ఎండ తీవ్రతతో పాటు వడగాలుల ప్రభావం అధికంగా ఉన్నట్లు పేర్కొంది. ఈ జిల్లాల్లో ఇప్పటికే ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపింది. శనివారం మరో ఏడు జిల్లాల్లోను 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని, ఈ జిల్లాలకూ ఎల్లో హెచ్చరికలు అమల్లోకి వస్తాయని తెలిపింది.

# శక్తి యాప్ పట్ల విస్తృతంగా అవగాహన చేయండి: ఎస్పీ జగదీష్

**ఆపద సమయాలలో మహిళలకు ఉపయోగపడుతుంది**




అనంతపురం (ప్రశ్న న్యూస్ )మహిళలు అమ్మాయిల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించి అమల్లోకి తీసుకొచ్చిన శక్తి యాప్ పట్ల జిల్లాలో విస్తృతంగా అవగాహన చేయాలని జిల్లా ఎస్పీ జగదీష్ జిల్లాలోని పోలీసు అధికారులు, శక్తి టీమ్స్ కు ఆదేశాలు జారీ చేశారు. ప్రతీ మహిళ తమ ఫోన్లో డౌన్లోడ్ చేసుకుని ఆపద సమయంలో పోలీసు వారి తక్షణ సహాయం పొందేలా చైతన్యం చేయాలన్నారు. ఈ యాప్ ప్రధానంగా మహిళలపై జరిగే వేధింపులు, అత్యాచారాలు, ఇతర హింసాత్మక సంఘటనలను నివారించటానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈనేపథ్యంలో జిల్లాలో గృహిణిలు, ఉద్యోగినులు, విద్యార్థినిలు, ఇలా వివిధ వర్గాల మహిళలు అమ్మాయిలు శక్తి యాప్ సేవలు వినియోగించుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఇలా డౌన్లోడ్ చేసుకుని పోలీసు సేవలు వినియోగించుకోండి ముందుగా ఫోన్లో ఉన్న గూగుల్ ప్లే స్టోర్ ద్వారా శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలి. అందులో .మీ వ్యక్తిగత వివరాలను నమోదు చేసుకోవాలి. ఓటిపితో ఫోన్ నెంబర్ అనుసంధానం చేసుకోవాలి. అత్యవసర పరిచయాలను జోడించాలి. ఏదైనా ప్రమాదం జరిగితే, యాప్ ఓపెన్ చేసి ఎస్ ఓ ఎస్ బటన్ ను నొక్కితే, మీరు ఉన్న లొకేషన్ ను గుర్తించి పోలీసులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటారు యొక్క యాప్ మహిళలకు ఎంతో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా ఎస్పీ తెలియజేశారు.

# నిర్మానుష్యమైన ప్రదేశాలలో డ్రోన్ నిఘా తో నేరాలకు అడ్డుకట్టు. జిల్లా ఎస్పీ



శ్రీకాకుళం (ప్రశ్న న్యూస్) రెండవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో గల కిమ్స్ హాస్పటల్ పరిసరాలు,శాంతి నగర్ కాలనీ, బలగ తదితర నాగావళి నది పరివాహక ప్రాంతాలు, పట్టణ చివర ప్రాంతాలలో నిర్మానుష్యమైన ప్రదేశాలలో శుక్రవారం డ్రోన్ నిఘా పెట్టి,చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్టు వేయడం జరుగుతుంది. ఎస్పీ మహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం రెండవ పట్టణ చివర ప్రాంతాలలో బహిరంగంగా మద్యం సేవించడం ,గంజాయి సేవించడం,పేకాట, ఈవిటిజింగ్, చైన్ స్నాచింగ్ తడితర నేరాలు పై డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టీ పాడుపడిపోయిన బంగ్లాలు, నివాస గృహాలు పై డ్రోన్ కెమెరాలతో చిత్రీకరిరించి, బహిరంగంగా మద్యం సేవించడం గంజాయి సేవించడం వారు పట్టుబడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అని తెలియజేశారు.

# వివాహ వేడుకల్లో పాల్గొన్న ఏనుగు రవీందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్



బాన్సువాడ( ప్రశ్న న్యూస్) వర్ని మండల్ సీసీడీ లో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెనుమర్తి పట్టాభి కుమారుడు మరియు గుణ్ణం త్రిమూర్తులు కూతురి వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఏనుగు రవీందర్ రెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్



నందిగామ (ప్రశ్న న్యూస్) పట్టణంలోని శ్రీకరం కళ్యాణ మండపంలో ప్రముఖ కాంట్రాక్టర్ పాలేటి సతీష్ కుమార్తె వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపిన శాసనమండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట వైసిపి ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు , స్థానిక వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఓక్లాండ్ స్కూల్ 5వ వార్షికోత్సవ వేడుకలు పాల్గొన్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ



నరసరావుపేట( ప్రశ్న న్యూస్ ) ప్రముఖ ఓక్లాండ్ స్కూల్ 5వ వార్షికోత్సవ వేడుకలలో పాల్గొన్న దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు డా. గొట్టిపాటి లక్ష్మీ నీ సత్కారించి మేమేంటో అందజేయటం జరిగినది. ఈ కార్యక్రమంలో డాక్టర్ . లక్ష్మీ గురువు , విద్యావేత్త, ప్రముఖ కవి బండ్ల మాధవరావు , ఓక్లాండ్ స్కూల్ చైర్మన్ కంకణంపాటి హనుమంతరావు పాల్గొన్నారు.

# కలకలం రేపుతున్న విజయసాయిరెడ్డి లీక్స్

**విజయవాడ :** వైసీపీ హయాంలో మద్యం సరఫరాలో అవకతవకలు జరిగాయని టీడీపీ ఆరోపిస్తుంటే.. అలాంటిదేమీ లేదు.. అంతా పారదర్శకంగానే జరిగిందని వైసీపీ గట్టిగా వాదిస్తోంది. ఇలాంటి టైమ్లో.. విజయసాయి రెడ్డి పేల్చిన లిక్కర్ బాంబ్.. ఆంధ్రా పాలిటిక్స్ని కుదిపేస్తోంది.నిప్పు లేనిదే పొగ రాదు. ఎంతో కొంత నిజం లేనిదే.. విమర్శలు, ఆరోపణలు రావు! ఇప్పుడు.. ఏపీలో లిక్కర్ స్కామ్ గురించి వినిపిస్తున్న చర్చలు, నాయకుల మాటలు వింటుంటే.. ఇదే అనిపిస్తోంది. ఏపీలో గత ప్రభుత్వ హయాంలో లిక్కర్ స్కామ్ జరిగిందని టీడీపీ బలంగా చెబుతుంటే.. అలాంటిదేమీ లేదని వైసీపీ చెబుతూ వస్తోంది. ఈ విషయంలో రెండు పార్టీలు దెబ్బలాడుకుంటున్న సమయంలో.. వైసీపీలో కీలకంగా పనిచేసిన విజయసాయి రెడ్డి చేసిన వ్యాఖ్యలు.. ఇప్పుడు హాట్ టాపిక్గా మారాయి. ఇప్పటివరకు ఈ లిక్కర్ స్కామ్ విషయంలో కొంత కన్ఫ్యూజన్ ఉన్నా.. విజయసాయి రెడ్డి చెప్పిన మాటలు విన్నాక.. తెరలన్నీ తొలగిపోతున్నట్లనిపిస్తోంది.విజయసాయి రెడ్డి వెర్షన్. ఇందులో.. ఇంకో డౌటే అవసరం లేదు. తమ హయాంలో మద్యం సరఫరాలో అవకతవకలే జరగలేదని వైసీపీ గట్టిగా వాదిస్తున్న సమయంలో.. విజయసాయి రెడ్డి పేల్చిన లిక్కర్ బాంబ్ ఆ పార్టీలో కలకలం రేపుతోంది. లిక్కర్ స్కామ్లో.. కర్త, కర్మ, క్రియ అంతా కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డేనని తేల్చి చెప్పేశారు. మద్యం సరఫరా అవకతవకల్లో.. పాత్రధారి, సూత్రధారి కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డేనన్నారు. దాంతో.. లిక్కర్ విషయంలో టీడీపీ ఆరోపిస్తున్నట్లుగా.. స్కామ్ జరిగిందనే విషయాన్ని విజయసాయి చెప్పకనే చెప్పారనే చర్చ జరుగుతోంది.ఇప్పటికే.. ఈ వ్యవహారానికి సంబంధించి సీఐడీ కేసు నమోదు చేసింది. దానిపై.. వేగంగా దర్యాప్తు కొనసాగుతోంది. ఎఫ్ఐఆర్లోనూ కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి పేరు ఉంది. పైగా.. ఇతను వైసీపీ హయాంలో ఐటీ సలహాదారుగా పనిచేశారు. ఆ పార్టీలో కీలక నేతగానూ, పార్టీ పెద్దలకు సన్నిహితుడిగానూ కసిరెడ్డికి పేరుంది. అతని కనుసన్నల్లోనే లిక్కర్ స్కామ్ జరిగిందని విజయసాయి రెడ్డి చెప్పడంతో.. ఏపీలో నెక్స్ట్ ఏం జరగబోతోందనేది ఆసక్తి రేపుతోంది. అంతేకాదు.. లిక్కర్ స్కామ్కు సంబంధించి త్వరలోనే మరిన్ని విషయాలు బయటపెడతానని చెప్పడం కూడా.. పొలిటికల్గా మరింత హీట్ రేపుతోంది.వైసీపీ హయాంలో లిక్కర్ పాలసీపై.. శాసనమండలిలోనూ అధికార, ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధం నడిచింది. గత ప్రభుత్వంలో మద్యం అమ్మకాల్లో అవకతవకలు జరిగాయని మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. సిట్ విచారణకు ఆదేశించిన వెంటనే కీలక పత్రాలు తగలబెట్టేశారన్న ఆరోపణల్ని.. వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ఖండించారు.వైసీపీ ప్రభుత్వంలో వేల కోట్ల మేర లిక్కర్ స్కామ్ జరిగిందనేది కూటమి నేతల ప్రధాన ఆరోపణ. దీనిపై.. ఇప్పటికే ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసి ప్రత్యేక విచారణ జరుపుతోంది. ఈ కేసులో వైసీపీలోని కొందరు ముఖ్య నేతల పాత్ర ఉందనే ప్రచారం జరుగుతోంది.

ఇప్పుడు విజయసాయి రెడ్డి మరో కీలక వ్యక్తి పేరు బయటపెట్టారు. దాంతో.. ఏపీలో లిక్కర్ స్కామ్ జరిగిందనే విషయం దాదాపుగా క్లియర్ అయిపోయింది. ఎందుకంటే.. గత ప్రభుత్వంలో విజయసాయి రెడ్డి కీలకంగా పనిచేశారు. ఆయనకు అన్నీ తెలుసని.. కీలక ఆధారాలు సైతం ఆయన దగ్గర ఉండొచ్చని అనుమానిస్తున్నారు.రాజకీయాలకు దూరంగా ఉంటానని చెప్పిన విజయసాయి రెడ్డి.. వైసీపీ హయాంలో రహస్యాల గుట్టు మొత్తం విప్పేస్తున్నారనే చర్చ కూడా సాగుతోంది. దాంతో.. వైసీపీలోని కీలక నేతలకు చిక్కులు తప్పవంటున్నారు. ప్రధానంగా.. ఆన్లైన్ ట్రాన్సాక్షన్లు ఏమీ లేకుండా.. డిస్టిలరీల నుంచి నేరుగా మద్యం తెచ్చి అమ్ముకున్నారని.. అలా వేల కోట్లు వెనకేశారనే ఆరోపణలున్నాయి. ఇప్పుడు.. వాటికి బలం చేకూర్చేలా విజయసాయి రెడ్డి వ్యాఖ్యలు చేయడం.. వైసీపీలో కలకలం రేపుతోంది. ఇదే సమయంలో.. రాష్ట్ర రాజకీయాల్లోనూ.. ఈ వ్యవహారం హాట్ డిబేట్గా మారింది.కొత్త లిక్కర్ పాలసీ, దశలవారీగా మద్య నిషేధం, ప్రభుత్వమే వైన్ షాపులు నిర్వహించే విధానం ముసుగులో.. వైసీపీ పెద్దలు భారీ కుంభకోణానికి పాల్పడ్డారనేది.. చాలా రోజులుగా వినిపిస్తున్న ప్రధానమైన ఆరోపణ. ఈ లిక్కర్ స్కామ్లో.. పెద్దిరెడ్డి, మిథున్ రెడ్డి కీలకంగా వ్యవహరించారని ఆరోపణలు కూడా ఉన్నాయి. డిస్టిలరీస్ని చేజిక్కించుకోవడం నుంచి కొత్త బ్రాండ్ల తయారీ దాకా అంతా మాఫియా తరహాలో జరిగిందనే వాదనలున్నాయి. అసలు లిక్కర్ స్కామ్ విషయంలో.. వైసీపీ ఎదుర్కొంటున్న ప్రధాన ఆరోపణలేంటి? నెక్స్ట్ ఏం జరగబోతోంది?ఏపీ లిక్కర్ స్కామ్లో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డిదే ప్రధాన పాత్ర అని తెలుగుదేశం నేతలు గట్టిగా ఆరోపిస్తున్నారు. మద్యం కంపెనీలతో సంప్రదింపులు జరపడం, అడిగినన్ని ముడుపులు ఇచ్చేందుకు అంగీకరించిన సంస్థలకే.. లిక్కర్ సప్లై ఆర్డర్లు దక్కేలా చూడటం, వారి నుంచి వసూలు చేసిన ముడుపుల్ని.. బిగ్ బాస్కు చేర్చడంలో.. మిథున్ రెడ్డే కీలకంగా వ్యవహరించారని ఆరోపిస్తున్నారు. ఇందుకోసం.. వైసీపీ హాయంలో ఐటీ శాఖ సలహాదారుగా పనిచేసిన.. కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డిని ముందుపెట్టి.. భారీ నెట్వర్క్ రన్ చేశారని టీడీపీ నేతలు చెబుతున్నారు. ఒక్కో మద్యం కేసుకు.. 150 నుంచి 450 వరకు వసూలు చేశారంటున్నారు.

ఈ లెక్కన.. నెలకు 60 కోట్ల చొప్పున నాలుగేళ్లలో 3 వేల కోట్లు కొల్లగొట్టారని తెలుగుదేశం నేతలు ఆరోపిస్తున్నారు.ఈ వసూళ్ల నెట్వర్క్ రూపకల్పన, అది పక్కాగా అమలయ్యేలా చూడటం వెనుక మాస్టర్ మైండ్.. ఎంపీ మిథున్ రెడ్డేనని టీడీపీ నేతలు అంటున్నారు. లిక్కర్ కంపెనీల నుంచి కొనుగోలు చేసిన మద్యానికి.. బేసిక్ రేటుని అడ్డగోలుగా పెంచేసి.. అనుచిత లబ్ధి పొందారని అంటున్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకొని.. ఈ స్కామ్ని అంతా తానై నడిపించారని చెబుతున్నారు. అంతేకాదు.. డిస్టిలరీల్లో పాగా వేసి.. వివిధ బ్రాండ్ల మద్యం తయారుచేయించి.. వాటికే అత్యధికంగా మద్యం సరఫరా ఆర్డర్లు ఇప్పించుకున్నారని ఆరోపిస్తున్నారు.వైసీపీ అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే.. ఏపీలో అతిపెద్ద డిస్టిలరీల్లో ఒకటైన నంద్యాలలోని.. ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్తో పాటు మరో డిస్టిలరీని అనధికారికంగా ఆయన గుప్పిట్లోకి తెచ్చుకున్నారని.. అక్కడే పెద్ద ఎత్తున కొత్త బ్రాండ్లు తయారు చేయించారని ఆరోపిస్తున్నారు. వాటికే.. 2701 కోట్ల విలువైన మద్యం సరఫరా ఆర్డర్లు కట్టబెట్టారని చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్ బేవరేజెస్ కార్పొరేషన్ దగ్గర మొత్తం 235 మద్యం సరఫరా కంపెనీలు నమోదై ఉన్నాయి. అందులో 168 ఏపీలోనివే. వాటిలో.. కేవలం ఏడు సంస్థలకే 9221 కోట్ల విలువైన మద్యం సరఫరా ఆర్డర్లు ఇచ్చారు. అంటే.. 7 సంస్థలకే 60 శాతం విలువైన ఆర్డర్లు కట్టబెట్టారనే విమర్శలున్నాయి. వీటిలో.. అత్యధికంగా గత సర్కార్ పెద్దలకు అస్మదీయ కంపెనీలుగా ఉన్నవాటికి, ముడుపులు చెల్లించిన సంస్థలకేనని.. తెలుగుదేశం నేతలు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా.. అదాన్ డిస్టిలరీస్.. విజయసాయి రెడ్డి అల్లుడైన రోహిత్ రెడ్డి బినామీ సంస్థ అనే ఫిర్యాదులు కూడా ఉన్నాయ్. దీనికి సొంతంగా ఒక్క డిస్టిలరీ లేదు. విశాఖ డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్, పీఎంకే డిస్టిలేషన్, ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ని.. సబ్ లీజు పేరిట ఆధీనంలోకి తీసుకొని.. అక్కడ ఉత్పత్తి చేసిన బ్రాండ్లను.. ఈ అదాన్ డిస్టిలరీస్ సంస్థ సరఫరా చేసినట్లుగా తెలుస్తోంది.మద్యం సరఫరా ఆర్డర్లు దక్కించుకున్న సంస్థల నుంచి ముడుపుల వసూళ్లకు కూడా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారని టీడీపీ ఆరోపిస్తోంది. ఈ చెల్లింపుల వ్యవహారాలు చూసేందుకు ప్రతి లిక్కర్ కంపెనీ, డిస్టిలరీ సంస్థ నుంచి ఒకరిని ప్రతినిధిగా నియమించుకున్నారట. అతను.. తనకు బాగా నమ్మకస్తులైన ఇద్దరు, ముగ్గురిని క్యాష్ హ్యాండ్లర్లుగా నియమించుకొని.. వారికి ముడుపుల సొత్తు అప్పజెప్పేవారట. వాళ్లు.. ఇందులో కీలకంగా ఉన్నటువంటి కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి నియమించిన కొరియర్లకు సొత్తు అప్పగించేవారని చెబుతున్నారు.

ఎప్పుడూ ఒకేచోట కాకుండా.. వేర్వేరు ప్రాంతాల్లో ముడుపులు అందజేసేవారని.. ఎప్పటికప్పుడు ఫోన్ నెంబర్లు మార్చేసేవారని అంటున్నారు.ఇక.. ఈ సొమ్ము మొత్తాన్ని ఒక చోటుకు చేర్చేందుకు.. ఓ కీలక వ్యక్తిని ఆర్గనైజర్గా నియమించారని.. ఆ నగదు మొత్తాన్ని కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డికి చేర్చేవారని అంటున్నారు. అతని దగ్గర్నుంచి.. పార్టీలోని మరో కీలక నేతకు వెళ్లేదంటున్నారు. అలా వచ్చిన బ్లాక్ మనీని వివిధ రూపాల్లోకి మార్చి.. బిగ్ బాస్కు చేర్చేవారనే ఆరోపణలున్నాయి. ఇప్పుడు.. వైసీపీలో కీలకంగా పనిచేసి.. పార్టీకి దూరమైన విజయసాయి రెడ్డి కూడా లిక్కర్ స్కామ్లో పాత్రధారి, సూత్రధారి అంతా కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డేనని చెప్పడం కూడా ఏపీ రాజకీయాల్లో కలకలం రేపుతోంది. ఏదేమైనా.. లిక్కర్ స్కామ్ జరిగిందా? లేదా? అనే విషయంలో.. విజయసాయి మాటలతో కొంత క్లారిటీ అయితే వచ్చేసింది. సిట్ దర్యాప్తుతో.. అతి త్వరలోనే అసలు విషయంలో ఏపీ అంతటా రీసౌండ్లో వినిపిస్తుందనే చర్చ సాగుతోంది.

# ఇంటర్ ఎడ్యుకేషన్లో కీలక మార్పులు

**రాజమండ్రి :** ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ బోధనలో కీలక సంస్కరణలకు బోర్డు ఆమోదం తెలిపింది. ఇంటర్మీయట్లో ప్రస్తుతం ఉన్న మ్యాథ్స్ ఎ-బిలు ఇకపై ఒకే సబ్జెక్టుగా, బాటనీ-జువాలజీలను ఒకే సబ్జెక్టుగా బోధిస్తారు.

ఈ విద్యా సంవత్సరం నుంచి ఇది అమల్లోకి రానుంది. ఏప్రిల్ 1 నుంచి ఇంటర్ తరగతులు మొదలవుతాయి.ఇంటర్ విద్యా బోధనలో కీలక సంస్కరణలో ఏపీ ఇంటర్ బోర్డు ఆమోదం తెలిపింది. విస్తృత ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం ఇంటర్మీడియట్ బోర్డులో సంస్కరణలకు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పచ్చజెండా ఊపారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ 77వ సమావేశం అమరావతి అసెంబ్లీలోని పేషిలో మంత్రి లోకేష్ అధ్యక్షతన నిర్వహించారు.ఇంటర్మీడియట్ లో విద్యలో నాణ్యత ప్రమాణాలను పెంపొందించి విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కాలేజిలవైపు ఆకర్షించేలా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజిల విద్యార్థులను తయారుచేసేందుకు 2025-26 విద్యాసంవత్సరం నుంచి క్యాలెండర్ లో మార్పులు చేపట్టారు.ఈ విద్యా సంవత్సరం నుంచి ఏపీలో ఇంటర్ జూన్ 1వతేదీకి బదులుగా ఏప్రిల్ 1 నుంచే ప్రభుత్వ కళాశాలలు ప్రారంభమవుతాయి. జూన్ 1 వ తేదీకి బదులుగా ఏప్రిల్ 7 నుండి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు అడ్మిషన్లు ప్రారంభిస్తారు.2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థులకు వార్షిక పరీక్షలను మార్చి 2026కి బదులుగా ఫిబ్రవరి చివరి వారం నుంచే నిర్వహిస్తారు. ట్యాబులేషన్ రిజిస్టర్లను పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేయాలని నిర్ణయించారు. డిజిలాకర్, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సజావుగా ఆన్లైన్ యాక్సెస్ ఉండేలా 1973 నుండి 2003 వరకు ఇంటర్మీడియట్ బోర్డు ఫలితాల డేటాను డిజిటలైజ్ చేస్తారు.ఇంటర్ లో చేరే విద్యార్థులకు సబ్జెక్టుల ఎంపికలో సౌలభ్యాన్ని పెంచి, బహుళవిభాగ అభ్యాసాలను ప్రోత్సహించడానికి ఈ విద్యాసంవత్సరం నుంచే మొదటి సంవత్సరం విద్యార్థులకు ఎలక్టివ్ సబ్జెక్టులను 2వ సబ్జెక్టుగా ప్రవేశపెట్టనున్నారు. లాంగ్వేజెస్, సైన్స్, హ్యూమానిటీస్ విభాగాల్లోని 24 ఆప్షన్స్ లో ఒక సబ్జెక్టును 2వ సబ్జెక్టుగా ఎంపిక చేసుకోవచ్చు.జూనియర్ కళాశాలల్లో ఎంబైపిసి ప్రవేశపెట్టాలనే ప్రజల డిమాండ్ కు అనుగుణంగా ఈ విద్యాసంవత్సరం నుంచి మ్యాథ్స్, బయాలజీ సబ్జెక్టులు అంతర్భాగాలుగా 6 సబ్జెక్టులతో ఎం.బైపిసి కోర్సును ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు 14 సబ్జెక్టులకు (సైన్స్, హ్యూమానిటీస్, లాంగ్వేజెస్ సహా) సవరించిన సిలబస్తో కొత్త పాఠ్యపుస్తకాలు ఈ విద్యా సంవత్సరం నుంచే అమలులోకి వస్తాయి.ఇంటర్మీడియట్ లో ఇప్పటివరకు రెండు సబ్జెక్టులుగా పరిగణిస్తున్న మ్యాథ్స్ ఎ, బిలను ఇకపై ఒకే సబ్జెక్టుగా విలీనం చేశారు. అలాగే బైపిసి విద్యార్థులకు బాటనీ, జువాలజీలు కలిపి ఒకే సబ్జెక్టు ఉండేలా విలీనం చేశారు. ఈ విలీనం వల్ల ఆయా సబ్జెక్టులకు సమాన వెయిటేజీ లభిస్తుంది.ఈఏపిసెట్, జెఇఇ, నీట్ వంటి పరీక్షలకు ప్రభుత్వ కళాశాలల విద్యార్థులను సన్నద్ధం చేయడానికి సమగ్ర పోటీ పరీక్షల కోచింగ్ మెటీరియల్ను ఇంటర్మీడియట్ బోర్డు తయారు చేస్తుంది. ఈ మెటీరియల్ బోర్డు పోర్టల్లో అందుబాటులో ఉంచుతారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు మెటీరియల్ ను ఉచితంగా అందజేస్తారు.కాంపిటీటివ్ బేస్డ్ ఎసెస్ మెంట్ కోసం ఇంటర్మీడిటయట్, సైన్స్, హ్యూమనిటీస్ విభాగాలప్రశ్నల్లో 10% తప్పనిసరిగా బహుళ-ఎంపిక ప్రశ్నలు, ఖాళీలను పూరించే రూపంలో ఒక మార్కు ప్రశ్నలు ఉండేలా కొశ్చన్ పేపర్ రూపొందించాలని నిర్ణయించారు. స్థాయి ప్రకారం సిలబస్ సవరణ, వృత్తి విద్యార్థుల కోసం డ్యుయల్ సర్టిఫికేషన్ ను ప్రవేశపెట్టనున్నారు. నైపుణ్య పర్యావరణ వ్యవస్థను మెరుగుపరచడానికి వీలుగా ప్రమాణాలను నిర్ణయించారు. సమగ్ర నిబంధనలను అభివృద్ధి చేయడం, వృత్తిపరమైన సిలబస్ను మెరుగుపరచడం కోసం భారత ప్రభుత్వ జాతీయ మండలితో సహకరించేలా ప్రణాళిక రూపొందించారు.వృత్తిపరమైన కోర్సుల పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు పరిశ్రమలకు అవసరాలకు తగ్గట్టుగా సవరించడానికి వీలుగా ఆయా ప్రాంతాల్లో ఏర్పాటయ్యే పరిశ్రమలతో ఒప్పందాలు చేసుకోవాలని నిర్ణయించారు.

# ఒక్క రూపాయకే లీటర్ పెట్రోల్

**పెద్దపల్లి** ధర్మారం మండలం కేంద్రంలో ఒక్క రూపాయికే లీటర్ పెట్రోల్ దొరకడంతో వాహనదారులు ఎగబడ్డారు. పెట్రోల్ బంక్ వద్ద బారులు తీరారు. కొత్తగా ఓ యూట్యూబ్ ఛానల్ పెట్టిన సందర్భంగా సబ్ స్క్రైబ్ చేసుకున్న 100 మందికి రూపాయికే లీటర్ పెట్రోల్ ఆఫర్ ఇచ్చారు. దాంతో మొదట సబ్ స్క్రైబ్ చేసుకున్న వందమందికి యూట్యూబర్ రూపాయికే లీటర్ పెట్రలో పోయించారు.

# రజనీ.. రోజా... నెక్స్ట్ ఎవరు...

**గుంటూరు :** ఆంధ్రప్రదేశ్ లో వైసిపి నేతల అవినీతి వ్యవహారాలపై అధికారులు రాష్ట్ర ప్రభుత్వం గట్టిగానే ఫోకస్ పెట్టారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు చెలరేగిపోయిన నాయకులపై ఇప్పుడు చంద్రబాబు నాయుడు గట్టిగా దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. మాజీ మంత్రుల అవినీతి వ్యవహారాలపై లెక్కలు తేల్చేందుకు సిద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. చిత్తూరు జిల్లాకు చెందిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పై ఇప్పటికే పలు కేసులు నమోదయ్యాయి. త్వరలోనే ఆయనను అదుపులోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయని వార్తలు వస్తున్నాయి.తాజాగా వైసీపీ మాజీ రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డి పై కూడా సిఐడి అధికారులు ఫోకస్ పెట్టారు. ఇక ఇప్పుడు మాజీ మంత్రి ఆర్కే రోజాపై గట్టి ఫోకస్ పెట్టింది

రాష్ట్ర ప్రభుత్వం. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఇష్టం వచ్చినట్టు మాట్లాడిన ఆర్కే రోజా.. అవినీతి వ్యవహారాల్లో కూడా అదే దూకుడు ప్రదర్శించారనే ప్రచారం అప్పట్లో పెద్ద ఎత్తున జరిగింది.ప్రధానంగా ఆడుదాం ఆంధ్ర అనే కార్యక్రమం లో? ఆమె క్రీడా శాఖ మంత్రిగా పెద్ద ఎత్తున దోపిడీకి పాల్పడ్డారనే ఆరోపణలు అప్పట్లో టిడిపి నేతలు చేశారు. ఇక టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆమెపై కఠిన చర్యలు ఉండే అవకాశం ఉందని అంచనా వేశారు. అయితే రోజా విషయంలో ఇప్పటివరకు అధికారులు ఎక్కడా దూకుడు ప్రదర్శించలేదు. అటు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆమె విషయంలో సైలెంట్ గానే ఉండిపోయింది. ఇక తాజాగా దీనిపై చంద్రబాబు సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది.గత వైసిపి ప్రభుత్వం హయాంలో ఆడుదాం ఆంధ్ర పేరుతో భారీగా నిధులు పక్కదారి పట్టినట్లు ఆరోపణలు రావడంతో.. రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. దీనిపై సోమవారం కూడా అసెంబ్లీలో చర్చ జరిగింది. దాదాపు 119 కోట్ల నిధులు ఆడదాం ఆంధ్ర పేరుతో దుర్వినియోగం అయినట్లు గుర్తించారు. ముఖ్యంగా బ్యాట్లు అలాగే క్రికెట్ కిట్లు కొనే విషయంలో ఆర్కే రోజా అవినీతికి పాల్పడ్డారు అని ఆరోపణలు వినిపించాయి. నాసిరకం క్రికెట్ బ్యాట్లను అప్పట్లో పంపిణీ చేశారని క్రీడాకారులు కూడా ఆరోపించారు.దీనిపై పలు వీడియోలు కూడా సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయ్యాయి. ఇప్పుడు వాటన్నింటినీ బయటకు తీసి అవినీతి వ్యవహారాలపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుంది. అటు మరో మాజీ మంత్రి విడదల రజనీపై కూడా కేసుల నమోదు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. దీనిపై గవర్నర్ అనుమతి తీసుకునేందుకు కూడా సిఐడి అధికారులు ఇప్పటికే ఒక లేఖ కూడా రాశారు. గవర్నర్ అనుమతి వస్తే ఆమెపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకునే అవకాశాలు కనబడుతున్నాయి.

# అమరావతిలో కీలక పరిణామం.. ప్రభుత్వం ఫుల్ ఫోకస్

**విజయవాడ :** అమరావతి రాజధాని నిర్మాణం పై ఏపీ ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. పునర్నిర్మాణ పనులు శరవేగంగా ప్రారంభించాలని నిర్ణయించింది. అటు క్యాబినెట్ సబ్ కమిటీ సైతం కీలక సూచనలు చేసింది. కేంద్ర ప్రభుత్వం సైతం అమరావతి రాజధాని నిర్మాణానికి సాయం ప్రకటించింది. కీలక రవాణా, రైల్వే ప్రాజెక్టులను సైతం మంజూరు చేసింది. ప్రపంచం గుర్తించదగ్గ రాజధానుల్లో అమరావతిని చేర్చాలని చంద్రబాబు భావిస్తున్నారు. 2028 నాటికి అమరావతి రాజధాని నిర్మాణ పనులు పూర్తి చేయాలని చూస్తున్నారు. అయితే ఈ నెల 15న అమరావతి పరిధిలో తిరుమల తిరుపతి దేవస్థానం స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని అన్ని ఏర్పాట్లు చేస్తోంది. వెంకటపాలెం లో గల శ్రీవారి ఆలయంలో కల్యాణోత్సవం జరగనుంది. సీఎం చంద్రబాబు తో పాటు పలువురు మంత్రులు హాజరు కానున్నారు.2014లో అధికారంలోకి వచ్చింది తెలుగుదేశం పార్టీ అమరావతిని రాజధానిగా ప్రకటించింది. 2018లో సీఎం చంద్రబాబు వెంకటపాలెంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి 25 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. 2019లో శంకుస్థాపన కూడా చేశారు. అటు తరువాత వచ్చిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అమరావతిని నిర్వీర్యం చేసింది. కానీ ఈ ఆలయ నిర్మాణాన్ని మాత్రం పూర్తి చేసింది. 2022లో వైభవంగా ప్రారంభించారు ఈ ఆలయాన్ని. ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. అధికారుల సమీక్ష వెంకటపాలెం శ్రీవారి ఆలయంలో.. కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని టీటీడీ కార్యనిర్వాహణ అధికారి శ్యామలరావు సమీక్ష చేశారు. శ్రీవారి ఆలయ ప్రాంగణంలో ఈ సమావేశం జరిగింది. టిటిడి అదనపు ఈవో వెంకయ్య చౌదరి, గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్ పాల్గొన్నారు. శ్రీనివాస కళ్యాణం పై అమరావతి గ్రామాల్లో టీటీడీ ప్రచార రథం పై పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. భక్తులు భారీగా తరలివచ్చి అవకాశం ఉండడంతో.. ఆలయ ప్రాంగణంలో గ్యాలరీలు, క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్ అంతరాయం తలెత్తకుండా పార్కింగ్ స్థలాలను గుర్తించామని.. పబ్లిక్ అడ్రస్ సిస్టం ద్వారా వాహనాలను ఎక్కడ నిలపాలనే విషయాన్ని భక్తులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తామని తెలిపారు. మొత్తానికైతే అమరావతిలో భారీ ఈవెంట్ కు ప్లాన్ చేసింది తిరుమల తిరుపతి దేవస్థానం.

# త్రాగడానికి మంచి నీళ్ళ కూడా ఇవ్వని నగరపాలక సంస్థ : గౌస్ దేశాయ్




కర్నూల్ (ప్రశ్న న్యూస్ )నగరంలో నగరపాలక సంస్థ పాలన చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుందని బాగా పన్నులు కట్టే ఎన్ ఆర్ పేట కొత్తపేట నర్సింగరావుపేట లాంటి ప్రాంతంలో కూడా త్రాగడానికి మంచినీళ్ల కోసం కటకటాలాడాల్సిన పరిస్థితి వచ్చిందంటే నగరపాలక సంస్థ పాలన ఎలా ఉందో చాలా స్పష్టంగా అర్థం అవుతుందని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారాన్ని కై సిపిఎం పార్టీ చేపట్టిన ప్రజా చైతన్య యాత్రను ఆయన ఈరోజు రోజా ప్రాంతంలో ప్రారంభిస్తూ మాట్లాడారు. సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రజల దగ్గరికి వెళ్లి ప్రజా సమస్యలు అడుగుతుంటే ప్రజలు కన్నీరు మున్నీరు అవుతున్నారని సొంత ఇంటిలో ఉందీ కూడా అద్దె ఇంటిలో ఉన్నట్లు ఉందని ప్రజలు వాపోయారని ఆయన తెలిపారు. జగన్మోహన్ రెడ్డిని ఉదయం లేచినప్పటి నుండి సాయంత్రం దాకా విమర్శలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో ఇంటి పన్నులు పెంచుతూ జగన్ తీసుకొని వచ్చిన జీవోలను ఎందుకు రద్దు చేయలేదని ఆయన సవాలు చేశారు. జగన్ పరిపాలన చేస్తున్నాడా చంద్రబాబు నాయుడు పరిపాలన చేస్తున్నాడా అర్థం కాని పరిస్థితిలో ఉందని ఆయన తెలిపారు. నిజంగా చంద్రబాబు నాయుడు పరిపాలన చేస్తుంటే జగన్ చేసిన చట్టాలు జగన్ వేసిన భారాలు తగ్గించాలి.ఆలా తగ్గిస్తానని చెప్పిన మాట ఎక్కడికి వెళ్లిందని ఆయన తెలిపారు. నగరపాలక సంస్థకు రెగ్యులర్ గా మిస్ కాకుండా పన్నులు కట్టే మధ్యతరగతి ప్రజలు ఉన్న ప్రాంతాల్లో త్రాగునీటికి కటకటాలాడుతున్నారంటే నగరపాలక సంస్థ పాలన ఎలా ఉందో అర్థం అవుతుందని పన్నులు వసూలు చేయడానికి పెట్టే శ్రద్ధ ప్రజల కనీస అవసరాలు తీర్చడంలో ఏ మాత్రం కనపరచడం లేదని ఆయన ఘాటుగా విమర్శించారు. ఒకవైపు విద్యుత్ భారాలు మరోవైపు ఇంటి పన్నుల భారారు భరించలేక ప్రజలు సతమతమవుతున్నారని అదిగాక ఈ మధ్యకాలంలో క్యాబ్ ఆటోలు ఆగడంతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయిందని, వీదులన్ని మురికి కూపంలాగా మారిపోయాయని ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా చెత్త కుప్పలు ఎత్తే పరిస్థితి లేదని ఆయన తెలిపారు. మాకు రేషన్ కార్డు లేవని కొందరు, మాకు సొంత ఇల్లు లేదు కాస్త ఇంటి స్థలం ఇచ్చే నాథుడే లేదని మరికొందరు, ఇంటి పన్నుల కోసం వెళితే లంచాలు అడుగుతున్నారని మరికొందరు ప్రజలు సిపిఎం కార్యకర్తల ముందు వాపోయారని ఆయన తెలిపారు టిడిపి కూటమి వచ్చిన తర్వాత లంచాలు లేనిదే ఒక్క పని కూడా జరగడం లేదని ఆయన విమర్శించారు. ఎన్నికల సందర్భంగా ఓట్లు అడగడానికి ఇంటింటికి తిరిగిన నాయకులు ఇపుడు తిరిగి చూడలేదని మాగోడు ఎవరికి చెప్పుకోవాలి అర్థం కాని పరిస్థితుల్లో ఉన్నామని ప్రజలు సిపిఎం నాయకులు దగ్గర తెలిపారు. ఇలాంటి సందర్భంలోనే సిపిఎం పార్టీ తన బాధ్యతగా భావించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజల దగ్గరికి వెళ్లి ప్రజా చైతన్యాన్ని కల్పించి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకుని వచ్చి ఇంటి పన్నులు తగ్గించడం కోసం, కరెంట్ చార్జీలు తగ్గించడం కోసం, నగరపాలక సంస్థ అదనపు కార్మికుల పెట్టి పేరుకుపోయిన చెత్త ఎత్తివేసేలా ఒత్తిడి చేయడం కోసం ఈ యాత్రను చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ కర్నూల్ నగరానికి సరిపడా త్రాగునీటి వసతులు కల్పించాలని ఎప్పుడో 2007- 08లో ఆరోజు సిపిఎం పార్టీ ఎమ్మెల్యే గఫూర్ గారు నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకులు తప్ప లక్ష జనాభా పెరిగిన జనాభాకు తగ్గట్టుగా నీటి సౌకర్యాలు కల్పించడంలో నగరపాలక సంస్థ వైఫల్యం చెందిందని రెండవ సమరం స్టోరేజ్ ట్యాంక్ కట్టండి మహాప్రభవు అంటే దాని గురించి కనీసం ఆలోచన చేసే సమయం కూడా వీరికి లేదని ఆయన ఘాటుగా విమర్శించారు మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం కోసం తక్షణం చర్యలు చేపట్టకపోతే నగరపాలక సంస్థ కార్యాలయాన్ని ప్రజలతో ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు అబ్దుల్లా, రామకృష్ణ, మదిలేటి, మహేష్ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## దర్శి పట్టణం అభివృద్ధి ప్రాంతంగా తీర్చిదిద్దుతా

**- డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ**



దర్శి ( ప్రశ్న న్యూస్) దేవుని ఆశీస్సులు, మన నేతల చిత్తశుద్ధి తో తొమ్మిది నెలల కాలంలో ప్రజలు ఆనందంగా ఉన్నారని దర్శి నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మునగపాడులో చౌడేశ్వరి అమ్మవారి తిరునాళ్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ గత రాత్రి దొనకొండ మండలం, తెల్లబాడు గ్రామ టిడిపి నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , ఐటీ శాఖ నారా లోకేష్ బాబు సారధ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సంపూర్ణ సహకారంతో ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీస్తుంది అని అన్నారు. 9 నెలల కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ కార్యక్రమాలతో ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి వైపు చక చక అడుగులు తీస్తుంది అని తెలిపారు. గత ఐదేళ్లలో ఆంధ్ర రాష్ట్రం విధ్వంసం చర్యలతో అభివృద్ధి లేని రాష్ట్రంగా మారింది. విజన్ ఉన్న నేతలు ప్రజల కోసం ప్రజల సంక్షేమం కోసం ప్రజల అభివృద్ధి కోసం అటు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాలను రెండు కళ్ళుగా సంక్షోభం నుండి అభివృద్ధి వైపు నడిపిస్తున్నారు అని ఈ సందర్భంగా అన్నారు అదే స్ఫూర్తితో దర్శి ప్రాంతంలో గత ఐదేళ్లలో నిర్లక్ష్యంగా వదిలేసిన ప్రాజెక్టులను పూర్తి చేసుకోవడంతో పాటు కొత్త ప్రాజెక్టులను కూడా ముందుకు తీసుకు వెళ్ళగలుగుతున్నాం అని తెలిపారు ఇందులో భాగంగానే దొనకొండ ప్రాంతంలో వెనుకబడిన ప్రాంతాన్ని అభివృద్ధి ప్రాంతంగా మార్చేందుకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు త్వరలో సోలార్ పార్కును ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసుకోబోతున్నామని అన్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి ప్రాంతంగా మారుస్తామని గొట్టిపాటి వారసురాలుగా ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నాను అని అన్నారు. అసెంబ్లీలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈ మేరకు దొనకొండ ప్రాంతంలో సోలార్ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. వీటన్నింటిని ముందుకు తీసుకు వెళుతూ ప్రజల అభిమానంతో ప్రజాపాలనను అందిస్తూ దర్శి ప్రాంతాన్ని అభివృద్ధి ప్రాంతంగా మారుస్తానని ఈ సందర్భంగా ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో గొట్టిపాటి లక్ష్మీ, టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ . దొనకొండ మండల టిడిపి అధ్యక్షులు నాగులపాటి శివకోటేశ్వర రావు, బండారు శ్రీను మరియు తెల్లబాడు గ్రామ టిడిపి నాయకులు, మహిళలు తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## మసీదులు, ఆలయాల్లో లౌడ్ స్పీకర్లపై ఆంక్షలు

**- యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్**



లక్నో (ప్రశ్న న్యూస్)మతపరమైన ప్రదేశాల్లో లౌడ్ స్పీకర్ల వినియోగంపై సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా వ్యవహరించాలని ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు. మసీదులు, ఆలయాలు తదితర ప్రార్థన స్థలాల్లో 55 డెసిబెల్స్ కంటే తక్కువ ఉండేలా చూసుకోవాలన్నారు. ఏ మతం లేదా మతపరమైన ప్రదేశాలల్లో లౌడ్ స్పీకర్ల అవసరం లేదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆయన గుర్తుచేశారు. ఈ మేరకు రాష్ట్రంలో అభివృద్ధి ప్రాజెక్టులు, హోలీ వేడుకలపై జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. హోలీ వేడుకల సమయంలో అధిక సౌండ్ డీజేలను నిషేధించాలని అధికారులను ఆదేశించారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, దుకాణాలు, వాణిజ్య సముదాయాలు తదితర కీలక ప్రదేశాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. అలాగే, పశువుల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలన్నారు. స్మగ్లర్లు, వాహన యజమానులు, పశువుల అక్రమ రవాణాకు సహకరించే పోలీసు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో పలు ప్రాజెక్టుల పనులు నత్తనడకన సాగుతున్నాయని, వెంటనే పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఈ వేసవిలో ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు.

**8 ఏండ్లలో 210 కోట్ల మొక్కలు నాటాం.**

రాష్ట్రంలో గత ఎనిమిదేండ్లలో 210 కోట్ల మొక్కలు నాటామని యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. రాష్ట్రంలో అర్బనైజేషన్ వేగంగా పెరుగుతున్నప్పటికీ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో అటవీ విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని చెప్పారు. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నాటిన 210 కోట్ల మొక్కలలో ఎన్ని బతికి ఉన్నాయో కూడా పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వం నాటిన మొక్కల్లో దాదాపు 70 శాతం నుంచి 75 శాతం చెట్లు బతికే ఉన్నాయని ఆయన తెలిపారు. అలాగే, పలు స్వచ్ఛంద సంస్థలు నాటిన మొక్కల్లో 65 నుంచి 70 శాతం సర్వైవల్ రేటు ఉందని పేర్కొన్నారు.

## నిబద్ధత విలువలతో కొనసాగుతున్న పార్టీ జనసేన: డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి




దర్శి (ప్రశ్న న్యూస్) నిబద్ధత విలువలతో కూడిన రాజకీయాలకు ప్రతీకగా కొనసాగుతున్న జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసిన దర్శి ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి. జనసేన పార్టీ అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ఆ పార్టీ ముఖ్య నాయకులకు, ప్రత్యేకంగా దర్శి నియోజకవర్గం లోని జనసైనికులు అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ ఆర్థిక సామాజిక అభివృద్ధికి జనసేన చిత్తశుద్ధితో పనిచేస్తుందని రాష్ట్ర అభివృద్ధిలో జనసేన పాత్ర కీలకంగా మారింది అని సందర్భంగా అన్నారు.. జనసేనకు ప్రకాశవంతమైన భవిష్యత్తు ఉంటుందనడంలో సందేహం లేదు. సాధించిన విజయాలు స్మరించుకుంటూ భవిష్యత్తుకు మార్గ నిర్దేశం చేసుకుంటూ ముందుకు సాగాలని జయకేతనం ఎగురవేయాలని కోరుకుంటున్నాను అని తెలిపారు.

## కళ్యాణ మండపాన్ని ప్రారంభించిన - యం ఎల్ ఎ కృష్ణప్రసాదు



విజయవాడ (ప్రశ్న న్యూస్ )రూరల్ మండలం షాబాద గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ మైసమ్మ తల్లి అమ్మవారి కళ్యాణమండపాన్ని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు శుక్రవారం ప్రారంభించారు. ఈ సంధర్భంగా శాసనసభ్యులు కృష్ణప్రసాదు మాట్లాడుతూ ప్రజలు, భక్తుల బహిరంగ ప్రయోజనాల కోసం నిర్మించిన ఈ కళ్యాణ మండపాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. యం ఎల్ ఎ కృష్ణప్రసాదు కి గ్రామపెద్దలు, స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ఎన్డీఏ కూటమి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## లంబాడి మహిళల తో హోలీ వేడుకలు

**- ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**



నంద్యాల (ప్రశ్న న్యూస్ )వసంతానికి స్వాగతం పలుకుతూ వచ్చిన ఈ రంగుల పండుగ హోలీ వేడుకలను ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి లంబాడి మహిళల మధ్య ఆనందంగా జరుపుకున్నారు. శుక్రవారం పాణ్యం నియోజకవర్గం కల్లూరు మండలం బైరాపురం తాండ, గడివేముల మండలం ఎల్ కే తాండ, పై బోగుల, నంద్యాల మండలం అబాండంతాండ మహిళలకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి హోలీ వేడుకలను పురస్కరించుకొని చీరెలు పంపిణి చేసి లంబాడి మహిళల మధ్య ఆనందోత్సవాల రంగుల పండుగ జరుపుకున్నారు. ఈ రంగుల పండుగ మీ జీవితాల్లో, కుటుంబాల్లో సంతోషాన్ని నింపాలని, అందరికి హోలీ శు భాకాంక్షలు తెలిపారు. కొందరు లంబాడి మహిళలు ఎంపీ డాక్టర్ శబరికి ఫోన్ ద్వారా తమ సమస్యలు చెప్పుకోగా, మరికొందరు మహిళలు వీడియో కాల్ ద్వారా ఎంపీ శబరి కి హోలీ శు భాకాంక్షలు తెలిపి ఆనందంగా ముచ్చటించుకున్నారు. నా పార్లమెంట్ పరిధిలోని అన్ని తాండాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి లంబాడి మహిళలకు హామీ ఇచ్చారు.

## కాలువలు శుభ్రం చేసి, ఫాగింగ్ చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడండి- సిపిఎం




నంద్యాల (ప్రశ్న న్యూస్ )పట్టణంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా చైతన్య యాత్ర రెండవ రోజు పాదయాత్రలో గాంధీ చౌక్, నభి నగర్,నివర్తి నగర్, జగజ్జనని నగర్, ఫరూక్ నగర్, గుడిపాడిగడ్డ, బాల్కొండ హాల్, ఉప్పరపేట, ఆత్మకూర్ బస్టాండ్ ప్రాంతాలలోని విధుల్లో పాదయాత్ర నిర్వహించడం జరిగింది. ఈ పాదయాత్ర లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వారి ద్వారా తెలుసుకుంటూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే ప్రధాన ఉద్దేశమని అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్,పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పి నరసింహులు, సిపిఎం సీనియర్ నాయకులు తోటమద్దులు మాట్లాడుతూ పట్టణంలోని నడిగడ్డ, నబి నగర్ ప్రాంతాలలో కాలువలను సరిగా శుభ్రం చేయడం లేదని రెండు రోజులకు ఒకసారి తీసుకొచ్చిన చెత్తను రోడ్డుపైనే విచ్చలవిడిగా వేయడం వలన పందులు మేకలు, కుక్కలు తింటూ చెల్లాచెదురుగా చేస్తున్నాయని వాటిపైన నిలబడిన దోమలు ఇళ్లలోకి చేరి రోగాలు వచ్చేలాగా ఉన్నాయని రోడ్డుపైనే ట్రాన్స్ఫారం ఉన్న ఎలాంటి కంచె ఏర్పాటు చేయకపోవడం వలన పశువులు మనుషులు భయాందోళనకు గురవుతున్నారని వెంటనే ఇనుపకంచె ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులు పట్టించుకోవడం లేదని, ప్రజా ప్రతినిధులు ఎవరు కన్నెత్తి చూడడం లేదని ఎన్నికల సమయంలో గుర్తు వస్తాము తర్వాత పూర్తిగా మమ్మల్ని మర్చిపోయి మా జీవితాలతో చెలగాటమాడుతున్నారని, దోమలపై దండయాత్ర అంటూనే ఫాగింగ్ ఇంతవరకు ఒక్కసారి కూడా చేయలేదని విన్నవించారని అన్నారు.

అదేవిధంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మహిళలందరికీ ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికి నెలకు 1500 ఇస్తామన్న హామీని,ఉచిత బస్సు ప్రయాణ హామీని నెరవేర్చాలని ఇంట్లో ఎంతమంది చిన్నపిల్లలు ఉంటే వారందరికీ తల్లికి వందనం అమలు చేయాలని, ఒక సంవత్సరం అందర్నీ మభ్యపెట్టే ప్రయత్నం చేశారని అన్నారు. ఎండాకాలం లో ఇంట్లో ఫ్యాన్ వేసుకోవాలంటే కరెంటు చార్జీలు పెరగడం వలన భయాందోళనకు గురవుతున్నామని, గతంలో 200/- వస్తే 500/- రూపాయలు బిల్లు వచ్చేలా పెరగడం వలన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక పోయిందని అన్నారు.

ప్రజల్లో తిరుగుబాటు సంవత్సరం కాకముందే మొదలైందని కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఇప్పుడు నెరవేరుస్తాం అప్పుడు నెరవేరుస్తామని కాలం వెళ్లబుచ్చుతుందని, ఇప్పటికైనా కళ్ళు తెరుచుకోకపోతే ప్రజల తిరుగుబాటుతో కూటమి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పి నరసింహ, కే మహమ్మద్ గౌస్, పార్టీ సీనియర్ నాయకులు తోట మద్దులు,వీరితో పాటు పార్టీ నాయకులు రామరాజు, వీరసేన, సిపిఎం కార్యకర్తలు బుజ్జి, శివ, ఆంజనేయులు, రానా, సందీప్,హరి, శ్రీనివాసులు, లతోపాటు మరో 30 మంది పాల్గొన్నారు.

## ఎస్సీ సెల్, ముఖ్య నాయకుల సమావేశం

**-బూర్ల రామాంజనేయులు**



పత్తిపాడు (ప్రశ్న న్యూస్)ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయబోతున్న ఎస్సీ ,బీసీ, మైనారిటీ మరియు ఓసి లకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో విద్యుత్ వినియోగంపై స్పష్టమైన ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి ఎస్సీలకు ఉచితంగా, బీసీల80 శాతం, మిగతా కులాలకు 60 శాతం సబ్సిడీతో ప్రతి ఇంటి పై సోలార్ ఏర్పాటు చేసుకొని విద్యుత్తు వినియోగంలో రైతులు ప్రయోజనం పొందాలని, వివిధ కులాలకు కార్పొరేషన్ లోన్లు ద్వారా అర్హులైన పేదలకు న్యాయం చేకూరుతుందని దానికి ప్రత్తిపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మరియు కూటమి నాయకులు పారదర్శకంగా పనిచేయాలని రాబోయే రోజుల్లో ప్రత్తిపాడు నియోజవర్గం అభివృద్ధి పథంలో పయనించటానికి తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు తెలుగుదేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షులు, పార్టీ కార్పొరేటర్లు డివిజన్ అధ్యక్షులు ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే పులివర్తి నాని

**ఎమ్మెల్యేకు దన్యవాదాలు తెలిపిన ఎ.చిన్న రెడ్డెప్ప కుటుంబసభ్యులు**



తిరుపతి,( ప్రశ్న న్యూస్ ) రూరల్ మండలం పరిధిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చిన్నగొట్టిగళ్ళు మండలం, టి. కుమ్మరపల్లి గ్రామానికి చెందిన ఎ.చిన్న రెడ్డెప్ప, వయస్సు 34 సంవత్సరాలు, కొన్ని సంవత్సరాలుగా క్యాన్సర్ వ్యాధితో బాదపడుతు చికిత్స పొందుతున్నరు. తిరుపతి జిల్లా పర్యటనలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ద్వారా కలిసి తన బాధను విన్నవించారు.అందులో భాగంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 1,00,000రూపాయలు మంజూరు చేశారు.

అనారోగ్య సమస్యతో బాధపడుతున్న విషయం ఎమ్మెల్యే పులివర్తి నాని తెలుసుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి సి.యం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించడంతో వారు ముఖ్యమంత్రి కి ఎమ్మెల్యే పులివర్తి నాని కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# నియోజకవర్గంలోని బాధితులకు సీఎం సహాయ నిధి

**చెక్కులు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**

**రాజకీయాలకు అతీతంగా సీఎం సహాయనిధి**

**పేద వర్గాలను ఆదుకుంటున్న ప్రభుత్వం మాది : తంగిరాల సౌమ్య**



నందిగామ (ప్రశ్న న్యూస్) పట్టణం లోని కాకాని నగర్ కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని 37 మందికి సీఎం సహాయ నిధి ద్వారా రూ.53 లక్షల 30 వేల 633 రూపాయల చెక్కులను ఎమ్మె ల్యే అందజేశారు. రాజకీయాలకు అతీతంగా సీఎం సహాయనిధి ద్వారా పేద వర్గాలను ఆదుకుంటున్న ప్రభుత్వం తమదని స్థానిక ఎమ్మెల్యే, విప్ తంగిరాల సౌమ్య అన్నారు. వైద్య సహాయం కోసం సీఎం చంద్రబాబు అందించిన నిధులు తమకు అందేలా కృషి చేసిన ఎమ్మెల్యేకి బాధితులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ వైద్య పరంగా అధికంగా ఖర్చులు పెట్టుకొనే వారికి సీఎంఆర్ఎఫ్ ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. పార్టీలకతీతంగా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి కూటమి నేతలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# చెత్త నుండి సంపద దిశగా విశాఖను అభివృద్ధి పరచండి

**స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయండి**

**- స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్**

విశాఖపట్నం(ప్రశ్న న్యూస్ )ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర ప్రదేశ్ గా అభివృద్ధి చేయుటకు స్వచ్ఛతా ఉద్యమాన్ని చేపట్టారని, అ దిశగా ప్రతి మూడవ శనివారం "స్వచ్ఛ ఆంధ్ర డే" కార్యక్రమాలను నిర్వహించడం జరుగుచున్నవని, 15వ తేదీ శనివారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణ ఇతివృతంగా జరగబోవు స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారిని భాగస్వామ్యం చేయాలని , చెత్త నుండి సంపద దిశగా విశాఖను అభివృద్ధి పరచాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ జీవీఎంసీ అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఆయన జీవీఎంసీ కార్పొరేటర్లు ,అధికారులతో కలిసి జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో స్వచ్ఛ విశాఖ కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో ముందుగా జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి. నరేష్ కుమార్ వివరించిన వేస్ట్ మేనేజ్మెంట్, పారిశుధ్య పనుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, వ్యర్థాల విభజన, సేకరణ, తరలింపు పనితీరును, నీటి సరఫరా విభాగం ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజనీర్ కె వి యన్ రవి యు జి డి సివరేజ్ నెట్వర్క్ కవరేజ్, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్వహణ తదితర అంశాలపై వివరించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ను స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ తిలకించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారిని భాగస్వామ్యం చేయాలని, ఈ కార్యక్రమాలకై ప్రత్యేకంగా ప్రతి డిపార్ట్మెంట్ నుండి జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను కూడా ఏర్పాటు చేయడమైనదన్నారు. విశాఖ నగరంలో వేస్ట్ మేనేజ్మెంట్, పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత నివ్వాలని, భవిష్యత్తు కార్యాచరణ దిశగా సస్టైనబుల్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రామాణికంగా 3ఆర్ సెంటర్ లను పూర్తి స్థాయిలో నిర్వహించాలన్నారు. ఈ-వేస్ట్, పేపర్ ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడం ద్వారా ఆర్థిక అభివృద్ధిని పెంచుకోవచ్చన్నారు. సి అండ్ డి వేస్ట్ ప్లాంట్ ను వినియోగంలోనికి తీసుకురావాలన్నారు. ఇంటింటి నుండి విభజించిన వ్యర్థాల సేకరణ వాహనాల ద్వారా తరలింపు, వాటి బరువు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని, అలాగే మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (ఎం ఆర్ ఎఫ్) కేంద్రాలను ప్రారంభించాలని, నగరంలో పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా విశాఖ నగరం మరింత సుందరంగా అభివృద్ధి చెందడమే కాకుండా ఇతర రాష్ట్రాలు, దేశాల నుండి పెట్టుబడులు వచ్చి రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరం పరిశుభ్రతతో నిర్వహించాలని లేకపోతే ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతుందని, పారిశుధ్య నిర్వహణ పనులకు, అపరిశుభ్ర ప్రదేశాలను గుర్తించేందుకు ప్రత్యేకంగా డ్రోన్ సర్వేల ప్రక్రియకు ప్రణాళికలను చేపట్టాలని అదనపు కమిషనర్ సోమన్నారాయణకు చైర్మన్ సూచించారు. లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ దిశగా 3 సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల కొరకు, మొబైల్ టాయిలెట్లు, బాతింగ్ క్యాబికల్స్, అదనంగా పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు కొరకు ప్రణాళికలను చేపట్టామన్నారు . నగరంలో ఉన్న ప్రజా మరుగుదొడ్లను మెరుగుపరచాలని, అదనపు మరుగుదొడ్ల కొరకు ప్రతిపాదనలను సమర్పించాలని ప్రధాన వైద్యాధికారికి చైర్మన్ ఆదేశించారు. నిత్యం జిందాల్ పవర్ ప్లాంట్ నుండి వస్తున్న ఎంత యాష్ ను ల్యాండ్ ఫిల్ చేస్తున్నారని ఆ సంస్థ ప్రతినిధి సతీష్ ను అడిగి తెలుసుకుని, సైంటిఫిక్ ల్యాండ్ ఫిల్ పై ప్రత్యేక పర్యవేక్షణ జరపాలని ప్రధాన ఇంజనీర్ శివ ప్రసాదరాజుకు చైర్మన్ ఆదేశించారు. అనంతరం గాజువాక గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ వలన ఆ ప్రాంత ప్రజల ఆరోగ్యాలకు ముప్పు కలుగుతున్నందున అక్కడ నుండి తరలించాలని కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు చైర్మన్ ను కోరగా, డంప్ యార్డ్ ఫ్రీ స్టేట్ గా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రణాళికలను చేపడుతున్నారని, డంప్ యార్డ్ ప్రాంతాలు అన్నిటిని కూడా గ్రీన్ స్పేస్ లు గా పచ్చదనంతో మలిచేందుకు రానున్న రోజుల్లో ప్రక్రియ జరుగనున్నదని చైర్మన్ తెలిపారు. దేశంలోనే 4వ పరిశుభ్ర నగరంగా ఉన్న విశాఖ నగరాన్ని 2024



స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకింగ్లో ప్రథమ స్థానం సాధనకు ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, ముఖ్యంగా ప్రజలు సహకరించాలని, జివిఎంసి యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని చైర్మన్ విజ్ఞప్తి చేశారు. అనంతరం పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం టౌన్ కొత్త రోడ్డు వద్ద ఉన్న సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను, ల్యాబ్ ను పరిశీలించి శుద్ధి చేసిన నీటిని తనిఖీ చేసారు. అనంతరం కాపులుప్పాడ డంపింగ్ యార్డులో నున్న జిందాల్ పవర్ ప్లాంట్ ను పరిశీలించిన అనంతరం పవర్ పాయింట్ ద్వారా జిందాల్ ప్రతినిధులు వివరించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బయోమైనింగ్ యార్డులో సుమారు 8 ఎకరాల్లో 4000 పండ్ల మొక్కలతో ప్రారంభించిన స్థలంలో చైర్మన్ మొక్కలను నాటి ఈ ప్రదేశం కాలుష్య నివారణకు దిక్సూచిగా, పచ్చదనాన్ని పెంపొందిస్తూ రాష్ట్రానికి ఆదర్శంగా ఈ బయోమైనింగ్ యార్డ్ గ్రీన్ స్పేస్ గా నిలిచిందని ప్రశంసించారు. ఈ కార్యక్రమాలలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్జునరావు,టిడిపి ఫ్లోర్ లీడర్ పీల శ్రీనివాసరావు జనసేన పార్టీ ఫ్లోర్ లీడర్ బిశెట్టి వసంత లక్ష్మి, బిజెపి ఫ్లోర్ లీడర్ గంకల కవిత, పలువురు కార్పొరేటర్లు, జీవీఎంసీ అదనపు కమిషనర్లు డి.వి. రమణమూర్తి, ఎస్.ఎస్.వర్మ,, పర్యవేక్షక ఇంజనీర్లు, డిడిహెచ్ ఎం.దామోదర రావు, కార్యనిర్వాహక ఇంజనీర్లు, సహాయ వైద్యాధికారులు, శానిటరీ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలతో కలిసి హెూలీ పండుగ జరుపుకున్న కార్పొరేటర్: దొడ్ల వెంకటేష్ గౌడ్



కూకట్ పల్లి( ప్రశ్న న్యూస్ )హెూలీ పండుగ శుభసందర్భంగా 124 డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పిల్లలతో కలిసి హెూలీ ఆడి రంగుల పండుగను ఆనందంగా జరుపుకున్నారు.
ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఫాల్గుణ మాసంలో పౌర్ణమి రోజున వచ్చే హెూలీ పండుగను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. రసాయనికి రంగులు వాడకుండా, సహజమైన రంగులతోనే హెూలీ పండుగను జరుపుకోవాలని కోరుతూ డివిజన్ ప్రజలందరికీ హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలియచేసారు.

# సాయినగర్ పంచాయతీలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్



తిరుపతి రూరల్ (ప్రశ్న న్యూస్) సాయినగర్ పంచాయతీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం, స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమం శనివారం మధ్యాహ్నం 3.00 గంటలకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పైన గ్రామ సభ నిర్వహించ నున్నారు. కావున అందరు ప్రజలు, వార్డ్ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది, ఎస్ హెచ్ జి సభ్యులు,హెల్త్ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది. విచ్చేసి మీటింగ్ లో పాల్గొని విజయవంతం చేయవలసింది గా సర్పంచ్ డి వి రమణ ఈ సందర్భంగా కోరారు.

# మాణిక్య వేల్ లాంటి మానవతావాది మృతి బాధాకరం :ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (ప్రశ్న న్యూస్ )ట్రిపుల్ ఎక్స్ అధినేత అరుణాచల్ మాణిక్య వేల్ లాంటి మానవతావాది మృతి చాలా బాధాకరమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. శుక్రవారం అరండల్ పేటలోని ఆయన నివాసములో మాణిక్య వేల్ భౌతికకాయాన్ని ఎమ్మెల్యే గళ్ళా మాధవి సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా గళ్ళా మాధవి మాట్లాడుతూ మాణిక్య వేల్ తమిళనాడు నుండి గుంటూరు వచ్చి చిన్నగా వ్యాపారం ప్రారంభించి అంచెలు అంచెలుగా ఎదిగి పెద్ద సంస్థను స్థాపించి గుంటూరులో వేలాదిమందికి ఉపాధిని కల్పించిన గొప్ప వ్యక్తి మాణిక్య వేల్ అని, ఆధ్యాత్మిక, సామజిక సేవా కార్యక్రమాలకు పెద్ద ఎత్తున విరాళాలు అందించిన మాణిక్య వెల్ లాంటి వ్యక్తి మృతి తీరని లోటని ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీవల్లి, ముత్తినేని రాజేష్,మద్రిపాటి శ్రీను,సానం రమేశ్, మునగా గణపతి తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్ ను కలిసిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతల బృందం

**గవర్నర్ అబ్దుల్ నజీర్ ని కలిసిన వారిలో ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్**

**రాష్ట్రంలో రాజ్యాంగ ఉల్లంఘనలు, అక్రమ కేసులు, వ్యవస్థల నిర్వీర్యం పై గవర్నర్ కు ఫిర్యాదు**

**అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ**



విజయవాడ (ప్రశ్న న్యూస్ )రాజ్యాంగాన్ని కాపాడాలని కోరాం. రాజ్యాంగాన్ని గవర్నర్ గా మీ ప్రభుత్వంలో అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరామని తెలిపిన శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ఈ సందర్భంగా మాట్లాడుతూప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం అర్హులు అయితే పథకాలు అందడం. భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని అన్నారు. సీఎం చంద్రబాబు రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు అని ఈ సందర్భంగా అన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి మాట్లాడని విధంగా మాట్లాడుతున్నారు అని అన్నారు. లబ్ధిదారులకు పార్టీలు, వర్గాలు ఉండవు అని తెలుగుదేశం వారికే పని చేయండి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వారికి పనిచేయవద్దు పథకాలు ఇవ్వద్దు అలా చేస్తే పాముకు పాలు పోసినట్లే అని మాట్లాడటం అత్యంత దుర్మార్గం అని ఈ సందర్భంగా అన్నారుముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసేటప్పుడు అందర్నీ సమదృష్టితో పాలన అందిస్తానని ప్రమాణం చేసిన వ్యక్తి దానికి విరుద్ధంగా వ్యాఖ్యలు చేయడంపై గవర్నర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ప్రతిరోజు వైసీపీ కార్యకర్తలు, నాయకులు, జర్నలిస్టులపై కూడా అక్రమ కేసులు పెడుతున్నారు. అన్ని విషయాలను గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లాం అని తెలిపారు.

# పారిశుధ్య పనులు చేయడానికి రోజువారీ వేతనంపై కార్మికులు అవసరం

**- నగర పాలక కమిషనర్**




గుంటూరు (ప్రశ్న న్యూస్ )నగరంలో పారిశుధ్య పనులు చేయడానికి రోజువారీ వేతనంపై కార్మికులు అవసరమని, ఆసక్తి కల్గిన వారు గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాల్ సెంటర్ లో నేరుగా లేదా 08632345103 కి కాల్ చేసి తమ వివరాలు నమోదు చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మెరుగైన పారిశుధ్య పనులు చేపట్టడం ద్వారా నగరాన్ని స్వచ్ఛ గుంటూరుగా తీర్చి దిద్దుకోవాడానికి ప్రస్తుతం ఉన్న కార్మికులకు అదనంగా కార్మికులు అవసరమన్నారు. కనుక రోజువారీ వేతనంపై కేటాయించిన ప్రాంతాల్లో కేటాయించిన పారిశుధ్య పనులు చేయడానికి ఆసక్తి ఉన్నవారు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే వార్డ్ ల వారీగా చెత్త తరలించడానికి 15 రోజులకు అద్దె ప్రాతిపదికన ట్రాక్టర్ లు అవసరమని ఆసక్తి కల్గిన ట్రాక్టర్ యజమానులు నగరపాలక సంస్థ కాల్ సెంటర్ లో నేరుగా, లేదా పైన తెలిపిన నంబర్ కి కాల్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇప్పటికే డివిజన్లలో మైక్రో ప్యాకెట్స్ వారీగా కార్మికులను క్రమబద్దీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేశామని, ఉత్తర్వుల మేరకు కేటాయించిన వార్డ్ ల్లోనే కార్మికులు విధులు నిర్వహించాలన్నారు. అనధికార సూపర్వైజర్ల పేరుతో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు కూడా వారికి కేటాయించిన వార్డ్ ల్లో పారిశుధ్య పనులకు హాజరు కావాలని స్పష్టం చేశారు. 24 గంటల్లో కేటాయించిన వార్డ్ ల్లో విధులకు హాజరుకాని ఎడల వారి స్థానంలో బదిలీ కార్మికులను ఆప్కాస్ లో రెగ్యులర్ గా నమోదు చేయడానికి సిఫార్స్ చేస్తామని తెలిపారు. శానిటరీ ఇన్స్పెక్టర్లు, ఎస్ఎస్ లు తమ వార్డ్ ల్లో కేటాయించిన కార్మికులను మాత్రమే విధులు కేటాయించాలని, అతిక్రమించిన వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు.

# టిడ్కో ఇళ్ల సముదాయాల్లో త్రాగునీరు అందించేందుకు తక్షణ చర్యలు : కమిషనర్



గుంటూరు (ప్రశ్న న్యూస్ )నగరపాలక సంస్థ పరిధిలోని టిడ్కో ఇళ్ల సముదాయాల్లో నివాసం ఉంటున్న వారికి త్రాగునీరు అందించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ అడవితక్కెళ్లపాడులోని టిడ్కో గృహ సముదాయాలను జిఎంసి, టిడ్కో ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి, మౌలిక వసతులపై ప్రజల తెలిపిన సమస్యలను తెలుసుకొని, సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అడవితక్కెల్లపాడులోని టిడ్కోఇళ్లల్లో షుమారు 13 వందల కుటుంబాలు నివాసం ఉంటున్నారని, సదరు ప్రాంతంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. తక్షణం త్రాగునీటి సమస్య తీరేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. అలాగే పారిశుధ్య సమస్యలపై కూడా ప్రజల నుండి అధికంగా ఫిర్యాదులు అందుతున్నాయని, సదరు ప్రాంతంలో ప్రత్యేకంగా డ్రైవ్ చేపట్టి శుభ్రం చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. పెన్షన్ల పంపిణీ, రేషన్ పంపిణీని ప్రజలకు చేరువగా అందించాలని సచివాలయ కార్యదర్శులను, నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అవసరమైన ప్రాంతాల్లో కచ్చా డ్రైన్లు, జిఎస్బీ రోడ్ ల ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. టిడ్కో గృహసముదాయాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు టిడ్కో ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. పర్యటనలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, టిడ్కో ఎస్ఈ ఉమామహేశ్వరశాస్త్రి, కార్పొరేటర్ బి.స్మిత పద్మజ, డిఈఈలు శ్రీనివాస్, సేతుబాబు, ఎస్ఎస్ సోమశేఖర్, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక నగరంగా అమరావతి

**దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**



అమరావతి (ప్రశ్న న్యూస్ )సీఆర్డీఏ పరిధిలోని టిటిడి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మార్చి 15 న జరుగనున్న శ్రీనివాస కళ్యాణోత్సవంతో ఆధ్యాత్మిక నగరంగా అమరావతి మారనుందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మీడియాతో మాట్లాడారు. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సమీపంలో గురువారం సాయంత్రం మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర విభజన అనంతరం నవ్యాంధ్ర రాజధానిలో టిటిడి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున టిటిడి ఆలయాన్ని నిర్మించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకోవడంలో భాగంగా ఏపీలో మరోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక టిటిడి ఎస్వీ ఆలయంలో అత్యంత వైభవంగా శ్రీనివాస కళ్యాణమహెూత్సవాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించి అందుకు తగ్గట్టుగా టిటిడి ఏర్పాట్లు చేపట్టిందన్నారు. శ్రీవారి ఆశీస్సులతో అమరావతి నగర నిర్మాణానికి వేగంగా అడుగులు వేసేందుకు నాంది పలుకనున్నారని తెలిపారు. ఈ కళ్యాణోత్సవం వేడుకకు సీఆర్డీఏ పరిధిలోని 24 గ్రామాల కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఉన్నతాధికారులు కుటుంబ సభ్యులతో రావాలని కోరారు. శ్రీనివాస కళ్యాణోత్సవానికి ఎల్లుండి మధ్యాహ్నంకు ఏర్పాట్లు పూర్తి కానున్నాయని ఆయన చెప్పారు. అంతకు ముందు కల్యాణ వేదిక ప్రాంగణాన్ని మంత్రుల బృందం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హెూంమంత్రి వి.అనిత, రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ మంత్రి పి.నారాయణ, టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు, టిటిడి బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మీ, ఎం.శాంతారామ్, ఎం.ఎస్.రాజు, వేమిరెడ్డి ప్రశాంతి, తుళ్ళూరు ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, ఈవో శ్యామల రావు, డిఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, దేవాదాయ శాఖ కార్యదర్శి వినయ్ చంద్, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, టిటిడి జేఈవో వి వీరబ్రహ్మం, ఎస్పీ సతీష్ కుమార్ తదితర అధికారులు పరిశీలించారు.

ప్రజాప్రశ్న





## రెట్రో కోసం సొంతంగా డబ్బింగ్ చెప్పిన

# పూజాహెగ్డే

సమకాలీన కథానాయికల్లో చాలా మంది తమ సొంత గొంతుతో డబ్బింగ్ చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. తెరపై పాత్ర సహజంగా కనిపించడంతో పాటు అభిమానులకు కూడా మరింత చేరువకావొచ్చనే ఉద్దేశ్యంతో ఓన్ డబ్బింగ్‌కే ప్రాధాన్యతనిస్తున్నారు. ఇప్పటికే రష్మిక మందన్న, కీర్తి సురేష్ వంటి అగ్రతారలు డబ్బింగ్ కోసం సొంత గళాన్ని అందిస్తున్నారు. ఇప్పుడు వీరి వరుసలో పూజాహెగ్డే చేరింది. ప్రస్తుతం ఈ భామ తమిళంలో సూర్య సరసన 'రెట్రో' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. కార్తిక్ సుబ్బరాజ్ దర్శకుడు. మే నెలలో విడుదలకానుంది. ఈ సినిమా కోసం పూజాహెగ్డే తమిళంలో సొంతంగా డబ్బింగ్ చెప్పింది. కెరీర్ తొలిసారి తాను సొంతంగా డబ్బింగ్ చెప్పడం ఆనందంగా ఉందని, ఇక ముందు అన్ని భాషల్లో ఇదే పద్ధతి ఫాలో అవుతానని పూజాహెగ్డే పేర్కొంది. తెలుగు సినిమాల్లో కూడా ఆమె ఓన్ డబ్బింగ్ చెప్పేందుకు సముఖంగా ఉందని తెలిసింది. గతకొంతకాలంగా సరైన విజయం కోసం ఎదురుచూస్తున్న పూజాహెగ్డే ప్రస్తుతం తమిళ ఇండస్ట్రీపైనే దృష్టి పెట్టింది. అక్కడ సూర్య 'రెట్రో', దళపతి విజయ్ 'జన నాయగన్', రాఘవ లారెన్స్ 'కాంచన-4' చిత్రాల్లో కథానాయికగా నటిస్తున్నది. ఈ సినిమాలు దక్షిణాదిన తనకు పూర్వ వైభవం తెచ్చిపెడతాయని ధీమా వ్యక్తం చేస్తున్నది పూజాహెగ్డే.

## మెగాస్టార్ చిరంజీవికి

# మరో అరుదైన గౌరవం..



హైదరాబాద్: మెగాస్టార్ చిరంజీవికి మరో అరుదైన గౌరవం దక్కింది. యూకే ప్రభుత్వం ఆయనకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ప్రకటించింది. నాలుగు దశాబ్దాలకుపైగా సినీ రంగానికి ఆయన చేస్తున్న విశేష సేవలకుగాను జీవిత సాఫల్య పురస్కారం అవార్డు అందించనున్నట్లు తెలిపింది. మార్చి 19న ఈ అరుదైన గౌరవాన్ని యూకే పార్లమెంటులో చిరంజీవి

## నటి స్నేహాకి వింత వ్యాధి..

# సీక్రెట్ బయట పెట్టిన భర్త



ఒకప్పుడు టాలీవుడ్‌లో ఓ వెలుగు వెలిగిన అందాల ముద్దుగుమ్మ స్నేహ. 2000 నుంచి 2020 వరకు హీరోయన్ గా చాలా సినిమాల్లో నటించిన ఈ ముద్దుగుమ్మ తన అందం, అభినయంతో ఎంతగానో ఆకట్టుకునేది. ఎక్కడ కూడా అశ్లీలతకి చోటు లేకుండా సినిమాలలో తన పాత్రలు ఎంచుకునేది. అయితే సినిమాలలో కొనసాగుతున్న సమయంలోనే స్నేహ 2012 మే 11న ప్రసన్న అనే నటుడిని వివాహం చేసుకుంది. తమిళ సినిమా షూటింగ్‌లో కలుసుకున్న వీరు, ఆ సినిమా షూటింగ్ అయిపోయే వరకు ప్రేమలో పడి ఆ తర్వాత పెళ్లి చేసుకున్నారు. ఇక ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం స్నేహ వైవాహిక జీవితం చాలా సంతోషంగా ఉంది. ఇక పెళ్లి తర్వాత సినిమాలు కాస్త తగ్గించిన స్నేహ సపోర్టింగ్ క్యారెక్టర్స్‌లో మెరుస్తుంది. రామ్ చరణ్ వినయవిధేయ రామ సినినిమాతో క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా రీ ఎంట్రీ ఇచ్చిన ఈ భామ అనంతరం పలు హిట్ సినిమాల్లో సపోర్టింగ్ రోల్స్ పోషించింది. గత ఏడాది వెంకట్ ప్రభు డైరెక్షన్‌లో 'గోట్' సినిమాలో విజయ్ దళపతి భార్యగా నటించి మెప్పించింది. టాలీవుడ్ లో సావిత్రి, సౌందర్య తరువాత అంత పద్దతిగల హీరోయిన్ గా స్నేహాకు మంచి పేరు ఉంది. కమర్షియల్ సినిమాలు ఇండస్ట్రీని ఏలుతున్న సమయంలో స్నేహ చీర కట్టుతోనే ఎక్కువగా కనిపించింది.తాజాగా స్నేహకి సంబంధించిన ఓ వార్త ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతుంది. గతంలో స్నేహ తన భర్తతో కలిసి ఇంటర్వ్యూలో పాల్గొంది. అందులో తనకి ఓసీడీ ఉందని తెలిపింది. దానికి వెంటనే రియాక్ట్ అయిన స్నేహ భర్త ప్రసన్న.. అవును ఇల్లు అది బాలేదు ఇది బాలేదు అంటూ 3 సార్లు మార్చింది. ఇక ఆమె మార్చకుండా ఉన్నది నన్ను ఒక్కడినే అంటూ సెటైర్ వేశాడు.అప్పుడు స్నేహ స్పందిస్తూ.. అవును నాకు ఇల్లు ఎప్పుడు శుభ్రంగా ఉండాలి. కిచెన్ క్లీన్ లేకపోతే అస్సలు ఊరుకోను. ఈ ఓసీడీ సమస్య అరుదైనదే అయిన అంతగా భయపడాల్సిన పని లేదు అంటూ స్నేహ అప్పట్లో చెప్పుకు రాగా, ఇప్పుడు ఈ వార్త నెట్టింట వైరల్ అవుతుంది.

# వాయిదాల మీద వాయిదాలు..

## కొత్త రిలీజ్ డేట్ ప్రకటించిన హరిహర వీరమల్లు మేకర్స్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రస్తుతం రాజకీయాలతో పాటు సినిమాలు చేస్తున్నారు. ఏపీ డిప్యూటీ సీఎంగా ఉన్న ఆయన ప్రజల సమస్యలపై ఎక్కువగా దృష్టి పెట్టారు. దీంతో సినిమాలు త్వరగతిన పూర్తి చేయడం ఇబ్బందిగా మారింది. పవన్ నటిస్తున్న హరిహర వీరమల్లు చిత్రం వాయిదాల మీద వాయిదాలు పడుతూ వస్తుంది. ఎప్పుడో విడుదల కావల్సిన ఈ చిత్రం తాజాగా మరోసారి వాయిదా పడింది.'హరి హర వీరమల్లు' చిత్రాన్ని తొలుత ఈ నెల 28న థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్టు చెప్పారు. ఇప్పుడు మే 9వ తేదీన చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు హెూలీతో పాటు జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అనౌన్స్ చేశారు.కొత్త పోస్టర్ విడుదల చేసి రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు. పోస్టర్‌లో పవన్, నిధి అగర్వాల్ ఇద్దరూ గుర్రపుస్వారీ చేస్తూ కనిపిస్తున్నారు. ఈ పోస్టర్‌తో టీమ్ ప్రేక్షకులకు హెూలీ శుభాకాంక్షలు తెలియజేస్తూ రిలీజ్ డేట్ ప్రకటించింది. 17వ శతాబ్దం నేపథ్యంలో సాగే ఈ కథలో, పవన్‌కల్యాణ్ చారిత్రాత్మక యోధుడిగా నటిస్తున్నారు.మొఘలుల కాలం నాటి చారిత్రక నేపథ్యంలో మూవీ తెరకెక్కుతోంది. ఇందులో పవన్ సరసన నిధి అగర్వాల్ నటిస్తుండగా, బాబీ డియోల్ ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నారు. జ్యోతికృష్ణ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రాన్ని మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్ రావు నిర్మిస్తుండగా, దానికి ఎ.ఎం.రత్నం సమర్పిస్తున్నారు. క్రిష్? జాగర్లమూడి కొంత ఈ సినిమాను డైరెక్ట్ చేశారు. కాని పలు కారణాల వలన ప్రాజెక్ట్ జ్యోతికృష్ణ చేతికి వెళ్లింది. ఇక ఈ చిత్రానికి ఎం.ఎం. కీరవాణి ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. భారీ అంచనాల నడుమ వస్తున్న ఈ చిత్రం తెలుగుతో పాటు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. రెండు భాగాలుగా రానున్న ఈ మూవీ తొలిభాగం 'హరి హర వీరమల్లు పార్ట్ 1: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో రిలీజ్ కానుంది. ఈ సినిమా షూటింగ్ మొదలైన కొన్ని నెలలకే ప్రచారం అంటూ పవన్ రాజకీయాలతో బిజీ కావడంతో మూవీకి బ్రేకులు పడ్డాయి. ఇప్పుడు ఏపీలో ఈ మూవీ షూటింగ్ చేస్తున్నారు జనసేనాని



# 36ఏండ్ల బ్రహ్మచారి కథ

సప్తగిరి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'పెళ్లికాని ప్రసాద్'. అభిలాష్ రెడ్డి దర్శకుడు. ఈ నెల 21న విడుదలకానుంది. దిల్‌రాజు ప్రొడక్షన్ హౌజ్ శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నది. గురువారం థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు.

36ఏళ్లు దాటిన ప్రసాద్ పెళ్లి గురించి టెన్షన్ పడుతుంటాడు. ఏజ్‌బార్ అయినప్పటికీ పెళ్లికి ఇబ్బంది కాదని తండ్రి అతనికి ధైర్యాన్నిస్తుంటాడు. మరింత ఆలస్యం జరిగితే ఇక పెళ్లికి అవకాశం ఉండదేమోనని ప్రసాద్ భయం. మరోవైపు తమ కుటుంబాన్ని మొత్తం పోషించే వరుడి కోసం అన్వేషిస్తుంటుంది హీరోయిన్ ఫ్యామిలీ. ఈ నేపథ్యంలో హిలేరియస్ ఎంటర్‌టైనర్ ఇదని చిత్రబృందం చెప్పింది. పెళ్లికాని ప్రసాద్ పాత్రలో సప్తగిరి తనదైన హాస్యంతో ఆకట్టుకున్నాడు. ప్రియాంకశర్మ, మురళీధర్ గౌడ్, లక్ష్మణ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: శేఖర్‌చంద్ర, నిర్మాణ సంస్థ: థామ మీడియా, విజన్ గ్రూప్, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: అభిలాష్ రెడ్డి గోపిడి.

## రాయలసీమ నేపథ్య కథలో

# అక్కినేని అఖిల్..

కెరీర్‌లో బ్లాక్‌బస్టర్ హిట్ కోసం ఎదురుచూస్తున్నారు యువ హీరో అక్కినేని అఖిల్. గత చిత్రం 'ఏజెంట్' ఆశించిన స్థాయిలో సక్సెస్‌కాకపోవడంతో తదుపరి సినిమాల విషయంలో ప్రత్యేక శ్రద్ధతీసుకుంటున్నారు. ప్రస్తుతం అఖిల్ స్వీయ నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఓ చిత్రాన్ని చేస్తున్నారు. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకుడు. ఇటీవలే ఈ సినిమాను అధికారికంగా ప్రకటించారు. నేటి నుంచి హైదరాబాద్‌లో రెగ్యులర్ షూటింగ్ మొదలుకానున్నట్లు తెలిసింది. రాయలసీమ నేపథ్యంలో పవర్‌ఫుల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నట్లు సమాచారం. అధికభాగం చిత్తూరు జిల్లాలో షూటింగ్ చేస్తారట. శ్రీలీలను కథానాయికగా తీసుకునే అవకాశముందని తెలిసింది.

ఈ చిత్రానికి 'లెనిన్' అనే టైటిల్‌ను పెట్టబోతున్నారని వార్తలొస్తున్నాయి. దసరా బరిలో రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.



## కోర్టు ఆవరణలో న్యాయవాదుల

# హెూళీ ఘన సంబరాలు

- బార్ అసోసియేషన్ అధ్యక్షులు
- గుడిసె సదానందం ఆధ్వర్యంలో హెూళీ వేడుకలు



వేములవాడ,(ప్రశ్న న్యూస్) రంగుల కేళి హెూళీ పండుగను శుక్రవారం వేములవాడ కోర్టు ఆవరణలో న్యాయవాదులంతా వివిధ రకాల రంగులను చల్లుకుంటూ ఘనంగా జరుపుకోవడం జరిగిందని వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం తెలిపారు. ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెూళీ కేవలం రంగుల పండుగ మాత్రమే కాదని,ఇది భారతీయ సంస్కృతిలో భాగంగా ఐక్యత, ఆనందాన్ని పెంచే పండుగ అని అన్నారు. శుక్రవారం నిర్వహించిన హెూళీ వేడుకల్లో వేములవాడ జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి,వేములవాడ సీనియర్ సివిల్ కోర్టు ఏజీపీ బొడ్డు ప్రశాంత్ కుమార్, న్యాయవాదులు పొత్తూరు అనిల్ కుమార్, గడ్డం సత్యనారాయణ రెడ్డి,గోగికార్ శ్రీనివాస్,గుండ రవి,కటకం జనార్ధన్,పిల్లి మధు,రేగుల రాజ్ కుమార్, సాగరం శ్రీధర్, గుజ్జే మనోహర్,భీమా మహేష్ బాబు,హరికృష్ణ,నాగేంద్ర బాబు పాల్గొన్నారు.

## పట్టణ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో

# ఘనంగా హెూలీ పండుగ వేడుకలు

కాంగ్రెస్ పార్టీ నాయకులు



వేములవాడ,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో శుక్రవారం హెూలీ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో హెూలీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వేములవాడ పట్టణ ప్రజలకు, పరిసరాల గ్రామాల ప్రజలకు హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వచ్చే సంవత్సరం హెూలీ పండుగ వరకు మంత్రి పదవిలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, నాయకులు కూరగాయల కొమురయ్య, ముప్పిడి శ్రీనివాస్,పులి రాంబాబు, అన్నారం శ్రీనివాస్, కోయల్ కార్ మస్తాన్, పుల్కం రాజు, తోట రాజు, నాగుల రాము, కొలకాని రాజు, ముప్పిడి శ్రీధర్, ముంజ ఉమేందర్, దాడి మల్లేశం, అంబాటి చందు, దూలం భూమేష్, కుతాడి రాజేశం, అరుణ్ తేజా చారి, కొక్కుల రాజు, కుమ్మరి శేఖర్, తదితరులు ఉన్నారు.

## ఇచ్చిన హామీలను దఫదఫాలుగా నెరవేరుస్తాం

- వేములవాడ ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్
- తిరుమల శ్రీవారి సేవలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



వేములవాడ,(ప్రశ్న న్యూస్) తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామివారిని శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ నియోజకవర్గం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని,తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తోందన్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు.కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేస్తూ ముందుకెళ్తోందని, రైతులకు రుణమాఫీ, గృహ జ్యోతి కింద పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తున్నామని, విద్యావిధానాలలో సమూలంగా మార్పులు తీసుకువస్తున్నామని, హైదరాబాదు ఫోర్త్ సిటీగా అవతరిస్తోందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఉన్నట్లే తిరుమలలో తెలంగాణ భక్తులకు దర్శన భాగ్యం కల్పించాలని, తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలను అనిమతించాలని కోరుతున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి మేరకు ఏపి సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించి ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, తెలంగాణ ప్రజాప్రతినిధుల లేఖలను అనుమతించే విధంగా టిటిడి చైర్మన్, టిటిడి ఈఓ, టిటిడి అడిషనల్ ఈఓ వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వెల్లడించారు.

## సీఫెల్ కాలనీలో హెూలీ సంబరాలు



మల్కాజిగిరి(ప్రశ్న న్యూస్) హెూలీ పండుగను సీఫెల్ కాలనీ వాసులందరు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. కాలనీలో గల పిల్లలు పెద్దలు అందరు ఉదయమే ఒక చోట చేరుకొని వయోభేధం లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని హెూలీ పండుగను జరుపుకున్నారు. అనంతరం తమ తమ ఇళ్ళల్లో వండి తెచ్చుకున్న ఆహారపదార్థాలతో, అందరు కలిసి అల్పాహారం, టీ, లస్సి లాంటి పదార్థాలు సేవించి సంతోషంగా హెూలీ పండుగను జరుపుకున్నారు.

## వేములవాడ రాజన్న సేవలో

## రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సతీమణి




వేములవాడ,(ప్రశ్న న్యూస్) దక్షిణ కాశీగా పేరు గాంచిన, ప్రముఖ శైవక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సతీమణి వారి కుటుంబ సమేతంగా రాజన్న ను దర్శించుకున్నారు. శు6 ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సతీమణి పద్మిని శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేశారు. వీరి వెంట ఆలయపర్యవేక్షకులు, ప్రోటోకాల్ పర్యవేక్షకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## హెూటళ్లు, లాడ్జీలలో అసాంఘిక

## కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

- వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ : వీరప్రసాద్
- పట్టణంలో అక్షయ లాడ్జిలో వ్యభిచారం నడిపిస్తున్న వ్యక్తితో పాటు లాడ్జి యజమానిపై కేసు నమోదు



వేములవాడ,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలోని అక్షయ లాడ్జీలో వ్యభిచారం నడుస్తుందనే విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం లాడ్జీలో క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించగా వ్యభిచారం నిర్వహిస్తున్న వ్యక్తితోపాటుగా లాడ్జీ యజమానిపై కేసు నమోదు చేయడం జరిగిందని వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ వెల్లడించారు. ఈసందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ వేములవాడ పట్టణ కేంద్రంలో అక్షయ లాడ్జి లో వేములవాడ పట్టణానికి చెందిన మల్లె రత్నయ్య(38) అనే వ్యక్తి అక్షయ లాడ్జి యజమాని శీలం విజయ్ కుమార్ యాదవ్ తో కలసి అక్షయ లాడ్జిలో హైదరాబాద్ నుండి అమ్మాయిలను తీసుకువచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు అక్షయ అక్షయ లాడ్జి పై తనిఖీ లు చేపట్టి ఒక విటుడు, ఒక అమ్మాయిని, మల్లె రత్నయ్య,శీలం విజయ్ కుమార్ యాదవ్ లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి శుక్రవారం మల్లె రత్నయ్యను రిమాండ్ కి తరలించడం జరిగిందని వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ తెలిపారు. హెూటల్స్, లాడ్జీలలో అసాంఘిక కార్యాలపాలకు పాల్పడితే కటిన చర్యలు తప్పవని,హెూటల్స్, లాడ్జిలలో ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని,లాడ్జిలలో బసకోసం వచ్చే వారి ఆధార్ కార్డులు, ఇతర ఐడెంటిటీ కార్డులు తప్పకుండ తీసుకోవాలని,లాడ్జిలో సీసీ కెమెరాలు తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని, ఎవరైనా కొత్తవారు, అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని సూచించారు.

## హెూళీ పండుగ శుభాకాంక్షలు!

## రంగుల పండుగలో కొత్త వెలుగులు..!!

- భాజపా పట్టణ ఉపాధ్యక్షులు : కటుకం శ్రీనివాస్



వేములవాడ,(ప్రశ్న న్యూస్) హెూలీ పండుగ సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రజలు శుక్రవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. వేములవాడ పట్టణంలో రంగుల అల్లరి, స్నేహితుల మధ్య నవ్వులు, మిఠాయిలు పంచుకునే దృశ్యాలు కనిపించాయి. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ వేములవాడ పట్టణ ఉపాధ్యక్షుల కటుకం శ్రీనివాస్ పట్టణ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ,"హెూలీ పండుగ మన సామరస్యానికి, ప్రేమకు ప్రతీక అని,రంగులు మన జీవితాల్లో ఆనందాన్ని నింపుతాయని,ఈ పండుగ అందరికీ సంతోషం, ఆరోగ్యం శ్రేయస్సు తేవాలని ఆకాంక్షించారు. హెూలీ వేడుకలలో భాగంగా వేములవాడ పట్టణంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించగా, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. హెూలీ పండుగ సందర్భంగా ప్రతి ఇంట్లో సంతోషం,నవ్వులు పూయాలని ఆకాంక్షిస్తూ... "హెూలీ పండుగ"శుభాకాంక్షలను భాజపా వేములవాడ పట్టణ ఉపాధ్యక్షులు కటుకం శ్రీనివాస్ తెలిపారు.

## గంశత్ రౌత్ కు ముఖ్యమంత్రి సహాయనిధి

## చెక్ అందించిన: బండి రమేష్



కూకట్ పల్లి ( ప్రశ్న న్యూస్ ) బేగంపేట్ డివిజన్ 149 చెందిన గంశత్ రౌత్ కి 60,000/- రూపాయల చెక్కు మంజూరైనవి . పార్టీ ఇంచార్జి బండి రమేష్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిదికి ధరకాస్తూ చేసుకోగ 60,000/- రూపాయలు మంజురు అయినవి. చెక్కులను బండి రమేష్ చేతులమీదుగా బాలానగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం రోజున అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, బండి రమేష్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, ఎక్స్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య , మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్ప రెడ్డి, కూకట్పల్లి ఏం సి డైరెక్టర్ అరుణ్, బోయిన్పల్లి ఏం సి డైరెక్టర్ అస్లాం, పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

## యువకులు క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలి

- గుగ్లోత్ తిరుపతి స్మారక క్రికెట్ టోర్నమెంట్లో బర్దిపూర్ క్రీడాకారుల విజయభేరి
- బహుమతులను అందజేసిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆర్మూర్ చిన్న బాలాజ్



ధర్పల్లి(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలోని మరియతాండ దమనపేట్ గుగ్లోత్ తిరుపతి స్మారక జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంటు జగదంబ క్రేజీ యూత్ ఆధ్వర్యంలో స్థానిక గోవిందపల్లి గ్రామంలోని క్రీడా ప్రాంగణంలో నిర్వహించబోయే క్రీడ పోటీలో సుమారు 76 గ్రూపులు పోటీ పడినట్లు స్మారక క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు తెలిపారు. ఈ క్రీడా పోటీలు ఫిబ్రవరి 20 తారీకు గురువారం నాడు ప్రారంభమైనట్లు ఆరోజు నుండి ఉత్సాహభరితంగా ప్రేక్షకుల సమక్షంలో క్రీడాకారులు పోటీ పడడంతో ఈ స్మారక క్రికెట్ టోర్నమెంట్ ప్రేక్షకులకు మరింత ఉత్సాహాన్ని కనబరిచింది. నువ్వా నేన అంటూ కొన్ని రోజులపాటు కొనసాగే పోటీలు ఈ వేసవిలో క్రీడాకారులకు శారీరక ధృఢత్వాన్ని , గెలుపొందాలనే సంకల్ప బలాన్ని క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు సమకూర్చినట్లు తెలుస్తోంది. జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్లో ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న ప్రేక్షకులకు మరింత ఊరట మొదలైంది. క్రీడా పోటీలు చివరి దశకు రావడంతో మార్చ్ 14 శనివారం రోజున పోటా పోటీగా కొనసాగిన క్రీడల్లో మరియతాండ, బర్దిపూర్ క్రీడాకారులు చివరి దశకు రానే వచ్చారు. చివరి దశలో ఎంతో చాకచక్యంగా క్రికెట్ పోటీలో తమ ప్రతిభను కనబరిచిన బర్దిపూర్ క్రీడాకారులకు మొదటి బహుమతి ట్రోఫీని, రెండవ బహుమతి,తండా క్రీడాకారులకు ఉత్సాహభరితమైన జగదాంబ క్రేజీ యూత్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ముఖ్య అతిథిగా విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆర్మూర్ చిన్న బాల్రాజ్, సొసైటీ చైర్మన్ చిన్నారెడ్డి స్వహస్రాలతో క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేసినట్లు క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు తెలిపారు.

## కూటమి ప్రభుత్వంపై అవాకులు, చవాకులు

## పేలితే ఎంతటి వారైనా సహించేదిలేదు

ఎమ్మెల్యే గిత్త జయసూర్య



నందికొట్కూరు (ప్రశ్న న్యూస్ )గడిచిన 10 నెలల నుండి నియోజకవర్గంలో కనీసం వైసిపి నాయకులు ఉన్నారా లేదా తెలియదు. అలాంటిది ఎదో కేసు విషయంగా కోర్టుకు వచ్చి ఉనికి చాటుకోవడంకోసం నోటికి వచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదన్న ఎమ్మెల్యే జయసూర్య. గత ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోకుండా రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చింది వైసిపి నాయకులు, మీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి కాదా, ఆడుదాం ఆంధ్రపై మండలిలో ప్రశ్నించింది మీ సభ్యులు కాదా, దానిపై వివరణ ఇస్తే ఉలిక్కిపాటు ఎందుకు. ఇదెలా ఉందంటే గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు తడుముకున్నట్టు ఒక అవినీతి జరిగింది అని దానిపై విచారణ జరుగుతుందంటే జరగనివ్వండి మీరెందుకు ఉలికిపడుతున్నారు. అక్కడ జరిగిన అవినీతి గురించి విచారణ జరిగితే అవినీతి పరులు ఎవరనేది బయటకు వస్తుంది అని అన్నారు. రాష్ట్రంలో గంజాయిని ప్రేరేపించి యువత నాశనం అయ్యేలా చేసింది మీ ప్రభుత్వం కాదా. సంక్రాంతి సంబరాలు అంటే గుర్తుకు వచ్చేది సాంస్కృతిక కార్యక్రమాలు, మీలాగా ప్యాలెస్ లో ఉన్నవారికి, కేసులపై కోర్టులకు తిరిగేవాళ్ళకి ఏమితెలుస్తాది. సాంస్కృతిక కార్యక్రమాలంటే మీ నాయకులలాగా కేసినోల ఏర్పాట్లు, పేకాట క్లబ్బులు ఏర్పాటు చేయడం కాదు అని ఈ సందర్భంగా అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 10 నెలల కాలంలో చెప్పిన విధంగా పెన్షన్ల పెంచడం, ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయడం జరుగుతుంది. అలాగే ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొకట్టిగా నెరవేరుస్తూ ముందుకు వెళుతుంటే పనికిరాని మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు అని అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడపడమే మా కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్య ఉద్దేశ్యం అని ఈ సందర్భంగా తెలియజేశారు.

# అధిక ధరలకు స్టాంపులు, బాండ్ పేపర్ల విక్రయాలు

- వందరూపాయల స్టాంప్ 300 కు విక్రయాలు
- కామన్ సర్వీస్ స్టాంప్ సెంటర్లు...స్టాంప్ వెండర్లు కీలక పాత్ర
- మాఫియాగా మారి అందరూ ఒకటే ధరలకు విక్రయాలు
- అధికారులకు తెలిసినా చర్యలు నిల్,
- చీకటి ఒప్పందాలు కారణమా.?- వినియోగదారులకు భారీ చిల్లు




నంద్యాల (ప్రశ్న న్యూస్) రాష్ట్రవ్యాప్తంగా స్టాంపులు, బాండ్ పేపర్లు అధిక ధరక అమ్మతో సొమ్ము చేసుకుంటున్న పట్టించుకునే నాధుడు లేకుండా పోయారు. నంద్యాలలో మరో దోపిడీ వెలుగుచూసింది.ప్రజల అవసరాలను క్యాష్ చేసుకుంటున్నారు.ప్రజలకు తప్పనిసరిగా అవసరం ఉండడంతో బహిరంగంగా దోచుకుంటున్నారు.అధికారులకు ప్రజలు పిర్యాదు చేసిన చీకటి ఒప్పందాలు ఉండడంతో వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విశేషం.నంద్యాల పట్టణంలో స్టాంపులు అధిక ధరల కు విక్రయిస్తున్నారు.నూరు రూపాయలు విలువచేసే స్టాంపులు మూడు వందలకు విక్రయిస్తున్నారు.అధికారులకు తెలిసిన చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రింగుగా మారి కామన్ సర్వీస్ స్టాంప్ సెంటర్ నిర్వాహకులు, వెండర్లు కీలకపాత్ర పోషిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.వివరాల్లోకి వెళితే రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం స్టాంపులు విక్రయించుకోవడానికి కామన్ సర్వీస్ సెంటర్లకు అనుమతి ఇచ్చింది.సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనుల భారం తగ్గించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.ప్రభుత్వ నిభందనలు మేరకు స్టాంపులు విక్రయించాల్సి ఉంది.ప్రజల అవసరాన్ని గుర్తించి సి.ఎస్. సి స్టాంప్ సెంటర్లు, స్టాంప్ వెండర్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలో సి.ఎస్. సి .స్టాంప్ సెంటర్లు, స్టాంప్ వెండర్లు అధిక సంఖ్యలో ఉన్న విషయం తెలిసిందే. స్టాంపులు అమ్మేవారు అందరూ కలసి రింగ్ కావడంతో ఎవరి వద్దకు వెళ్ళినా ఒకటే ధర ఉండడంతో ప్రజలు తప్పని సరి అవసరం ఉండడంతో నూరు రూపాయల స్టాంప్ మూడు వందలకు పెట్టీ కొనుగోలు చేస్తున్నారు. పొరపాటున ఎవరైనా ప్రశ్నిస్తే మాది వ్యాపారమే కదా అని చెప్పడం విశేషం. కార్యాలయంలోకి వెళ్లి అధికారులకు పిర్యాదు చేస్తే ఆ వ్యక్తికి స్టాంప్ ఇవ్వాలంటే చుక్కలు చూపిస్తున్నారని తెలిసింది. మరో విశేషం ఏమంటే మేము అధికంగా తీసుకుంటున్న డబ్బులో అధికారులకు సగం ఇవ్వకుంటే మాకు ఇబ్బంది అని కొందరు చెప్పకనే చెపుతున్నారు. లక్షల రూపాయల అడ్వాన్స్ లు కట్టి ,వేలకు వేలు బడుగలకు దుకాణాలు తీసుకున్నారంటే వారి ఆదాయం ఎంత ఉంటుందో అర్థం చేసుకోండి.

ఇటీవల కాలంలో స్టాంప్ దోపిడీ తో పాటు మ్యారేజ్ సర్టిఫికెట్ కావాలంటే మనిషిని బట్టి మూడు వేలు నుంచి అయిదు వేలు తీసుకుంటున్నారు నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలో అదుపెట్టలంటే ప్రజలు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి.సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అపార్ట్మెంట్,ఖాళీ స్థలం,ఇంటి కి,ఆయకం రిజిస్ట్రేషన్ లకు ఒకొక్క దానికి ఒకొక్క ధర నిర్ణయించారు. ప్రభుత్వం ఒక వైపు దళారులను ఆశ్రయించ కుండా నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పడం మాటలకే పరమితం అవుతుంది.పొరపాటున ఎవరైనా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కు వెళితే చుక్కలు చూపిస్తున్నారని కొందరు భాదితులు పేర్కొంటున్నారు.సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు డాక్యుమెంట్స్ రైటర్స్ తోనే కిటకిటలాడుతుంటాయి.ఇటీవల కాలంలో ఇద్దరు సబ్ రిజిస్ట్రారు లు సస్పెండ్ అయినా కార్యాలయంలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు.ప్రస్తుతం ఒకరు ఇటీవల సస్పెండ్ అయినా ఆయన స్థానంలో రావడానికి ఎందరో ప్రయత్నాలు సాగిస్తున్నారు పోస్టింగ్ కు నేతలకు భారీ నజరానా ఇస్తేనెపోస్టింగ్ వస్తుందని అంతా పెద్ద మొత్తంలో ఇచ్చుకోక కుర్చీ ఖాళీ దర్శనం ఇస్తుంది. ప్రజలను దృష్టిలో పెట్టుకొని ఉన్నతాధికారులు దోపిడీని అరికడతారో లేదో వేచి చూద్దాం.

# మోడీకి పుతిన్ థ్యాంక్స్



**న్యూఢిల్లీ ప్రశ్నన్యూస్** గత మూడు సంవత్సరాలకు పైగా ఉక్రెయిన్-రష్యా యుద్ధం కొనసాగుతోంది. అమెరికా అధ్యక్షులుగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైన తర్వాత ఈ వివాదాన్ని పరిష్కరించే ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి. త్వరలో కాల్పుల విరమణకు అంగీకరించనున్నట్లు కనిపిస్తోంది. అయితే ఈ కాల్పుల విరమణ చర్చలలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ముఖ్యమైన పాత్ర పోషించారు. కీవ్ కాల్పుల విరమణ ప్రతిపాదనపై తొలిసారిగా బహిరంగ ప్రకటన చేసింది. ఉక్రెయిన్-రష్యా వివాదాన్ని పరిష్కరించడానికి చేసిన కృషికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డా సిల్వా వంటి ప్రపంచ నాయకులకు రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ కృతజ్ఞతలు తెలిపారు.) బెలారసియన్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకాషెంకోతో జరిగిన సంయుక్త సమావేశంలో వ్లాదిమిర్ పుతిన్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. శత్రుత్వాలను అంతం చేసే ప్రతిపాదనలతో రష్యా అంగీకరిస్తుందని, అయితే ఈ విరమణ దీర్ఘకాలిక శాంతికి దారితీస్తుందని, సంక్షోభానికి మూల కారణాల తొలగిస్తుందనే ఆశతో ముందుకు సాగుతుందని" పుతిన్ అన్నారు.ఉక్రెయిన్ కాల్పుల విరమణకు సంసిద్ధత గురించి మీ అభిప్రాయాన్ని అడిగినప్పుడు, పుతిన్ స్పందించారు. "ఉక్రెయిన్ కాల్పుల విరమణకు సంసిద్ధత విషయానికొస్తే, ఉక్రెయిన్ ఒప్పందంపై ఇంత శ్రద్ధ చూపినందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. మనందరికీ మన దేశీయ వ్యవహారాలను చూసుకోవడానికి తగినంత సమయం ఉంది, కానీ అనేక దేశాల నాయకులు ఈ సమస్యను పరిష్కరిస్తున్నారు. చైనా అధ్యక్షుడు, భారత ప్రధానమంత్రి మోదీ, బ్రెజిల్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సహా అనేక మంది తమ సమయాన్ని దీనికి కేటాయిస్తున్నారు. ఈ ప్రయత్నం ఒక గొప్ప లక్ష్యాన్ని సాధించడమే.. వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నాము." అని పుతిన్ పేర్కొన్నారు. సౌదీ అరేబియాలో జరిగిన కాల్పుల విరమణ చర్చలపై పుతిన్ స్పందించారు. ఉక్రెయిన్ కాల్పుల విరమణకు అంగీకరించడానికి సిద్ధంగా ఉండటం అమెరికా ఒత్తిడి వల్లే జరిగిందని అన్నారు. ఉక్రెయిన్ యుద్ధ ఒప్పందం ట్రంప్ ఎన్నికల వాగ్దానాలలో ఒకటి.

# కిమ్ జోంగ్ ఉన్ తో ఇప్పటికీ నాకు మంచి సంబంధాలు ఉన్నాయి: డొనాల్డ్ ట్రంప్

- కిమ్ ఒక అణుశక్తి అన్న డొనాల్డ్ ట్రంప్
- మనం అణ్వాయుధాలను తగ్గించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్య



- ఉత్తరకొరియా, ఇండియా, పాకిస్థాన్ వద్ద కూడా అణ్వాయుధాలు ఉన్నాయన్న ట్రంప్

**అమెరికా (ప్రశ్నన్యూస్)** ఉత్తరకొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కిమ్ తో తనకు ఇప్పటికీ మంచి సంబంధాలు ఉన్నాయని ఆయన చెప్పారు. కానీ, కిమ్ ఒక అణుశక్తి అని వ్యాఖ్యానించారు. ఏం జరుగుతుందో చూద్దామని అన్నారు. నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టేతో ఓవల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు. దమన దగ్గర చాలా ఆయుధాలు ఉన్నాయని... వాటి శక్తి చాలా ఎక్కువని ట్రంప్ చెప్పారు. మనం అణ్వాయుధాల సంఖ్యను తగ్గించగలిగితే అది గొప్ప విజయం అవుతుందని అన్నారు. అణ్వాయుధాలను తగ్గించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

ఉత్తరకొరియా, ఇండియా, పాకిస్థాన్ వద్ద కూడా అణ్వాయుధాలు ఉన్నాయని అన్నారు. ట్రంప్ వ్యాఖ్యలు ఉత్తరకొరియా అణ్వాయుధాల విధానంలో ఎలాంటి మార్పునైనా సూచిస్తున్నాయా? అనే ప్రశ్నకు వైట్ హౌస్ అధికారి మాట్లాడుతూ... ట్రంప్ తన తొలి పదవీకాలంలో చేసినట్టుగానే ఉత్తరకొరియాను అణ్వాయుధ రహితంగా చేస్తారని చెప్పారు. ట్రంప్ తన తొలి పదవీకాలంలో కిమ్ తో చర్చలు జరిపిన సంగతి తెలిసిందే.

# పోలాండ్‌లో అణ్వాయుధాలు మోహరించాలన్న విజ్ఞప్తికి నో చెప్పిన ట్రంప్

- అమెరికా అణ్వాయుధాలు తమ దేశంలో మోహరించాలన్న పోలాండ్
- గతంలోనూ పోలాండ్ నుంచి ఇదే తరహా విజ్ఞప్తి
- అలాంటి ఆలోచన తమకు లేదన్న అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్



**అమెరికా (ప్రశ్నన్యూస్)** రష్యా దూకుడును నిలువరించేందుకు తమ దేశంలో అమెరికా అణ్వాయుధాలను మోహరించాలన్న పోలాండ్ అభ్యర్థనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించారు. ఈ విషయాన్ని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తాజాగా వెల్లడించారు. అమెరికా తన అణ్వాయుధాలను పశ్చిమ ఐరోపాలో కాకుండా పోలాండ్‌లో భద్రపరచాలని పోలాండ్ అధ్యక్షుడు ఆంద్రెజ్ దూడా గతంలో ప్రతిపాదించారు. అయితే, ఈ ప్రతిపాదనను అప్పటి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తిరస్కరించారు. ఈ విషయంపై స్పందిస్తూ, తాను ఈ అంశంపై ట్రంప్‌తో చర్చించినట్లు వాన్స్ తెలిపారు. తూర్పు యూరప్ సరిహద్దులకు అణ్వాయుధాల విస్తరణకు ట్రంప్ మద్దతు ఇస్తే తాను ఆశ్చర్యపోతానని ఆయన అన్నారు. బైడెన్ ప్రభుత్వం నిద్రమత్తులో తూగుతూ ఒక అణు సంక్షోభంలోకి నెట్టివేసిందని ఆయన విమర్శించారు. ఉక్రెయిన్‌కు ఆయుధాలు సరఫరా చేయడం ద్వారా మాస్కో, కీవ్‌లను రక్తసిక్తం చేశారని ఆయన ఆరోపించారు. ట్రంప్ అధ్యక్షుడిగా ఉండి ఉంటే ఈ యుద్ధమే వచ్చేది కాదని వాన్స్ అభిప్రాయపడ్డారు. సరిహద్దుల్లోకి నాటో దళాలు

# విశాఖ స్టీల్ ప్లాంట్ ని పరిరక్షించాలి

- అసెంబ్లీలో తీర్మానం చేయాలి
- మాజీ మంత్రి వడ్డే డిమాండ్




విజయవాడ (ప్రశ్న న్యూస్ )విశాఖ స్టీల్ ప్లాంట్ ని పరిరక్షించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాపాడాలని మాజీ మంత్రి శోభనాధీశ్వరావు డిమాండ్ చేశారు. శుక్రవారం విజయవాడ ధర్నా చౌక్ లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి వడ్డే మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల అనంతరం విశాఖ ఉక్కు పరిశ్రమ కార్మిక నాయకులకు రాతపూర్వకంగా ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. క్రేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయించిందని, ఆ నిధులు ప్లాంట్ ని కాపాడుకోవడం కోసమే అనటం విడ్డూరంగా ఉందన్నారు. ప్లాంట్ ని కాపాడుకోవాలంటే సంస్థకు సొంత నిధులు, గనులు కేటాయించాలని కోరారు. ప్రభుత్వ ఆధీనంలోని బొగ్గు, ఇనుము లాంటి గనులను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే సంస్థ నిర్వహణ భారమౌతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమి నేతృత్వంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ చిత్త శుద్ధిని పార్లమెంటు, అసెంబ్లీ తీర్మానం ద్వారా దేశ ప్రజానీకానికి, ప్రత్యేకంగా ఆంధ్ర ప్రజలకి విశ్వాశాన్ని కల్పించాలని పిలుపునిచ్చారు. రాజకీయలకు అతీతంగా అన్ని పక్షాలు విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఉద్యమించాలని, కాపాడుకోవాలని కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ప్రజల బలిదానాలు, ఆనాటి విద్యార్థుల ప్రాణ త్యాగాలతో నిర్మించబడిన విశాఖ స్టీల్ ప్లాంట్ ని, ఆ పరిశ్రమను రక్షించుకోవడం ఆంధ్ర ప్రజల హక్కు అని డిమాండ్ చేశారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంకణం కట్టుకోవాలని, లేదంటే ప్రజల ఆగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. గతంలో విద్యుత్ ఉద్యమం నేపథ్యంలో టిడిపి 10 ఏళ్లుగా అధికారానికి దూరమైన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను రక్షించకపోతే, మళ్లీ భవిష్యత్తులో పెరుగుతున్న ఉద్యమాల నేపథ్యంలో కూటమి ప్రభుత్వం కూడా అధికారం కోల్పోక తప్పదని దుయ్యబట్టారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ ఉద్యమ నాయకులు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు కేవలం బకాయిపడిన వేతనాలు, సంస్థ నిర్వాహణ కోసం మాత్రమే పనికొస్తాయని వివరించారు. సంస్థను కాపాడాలంటే సొంత నిధులు, గనులు అవసరం అన్నారు. నాణ్యమైన ఉత్పత్తి పెరగాలన్నా, కొత్తగా కార్మికులని రిక్రూట్ చేసుకోవాలన్నా, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్న ఈ నిధులు ఎందుకు చాలవన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ని రక్షించే వారైతే సమీపంలోని అనకాపల్లిలో మరో ప్రైవేట్ ప్లాంటైనా మిట్టల్ కంపెనీకి ఎందుకు ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తుందని ఎద్దేవా చేశారు. పొమ్మన లేక పొగబెట్టేందుకే విశాఖ స్టీల్ ప్లాంట్ కి పరోక్షంగా నష్టం చేస్తున్నారని, నీరుగారిస్తున్నారని విమర్శించారు. ఇంకా ఈ ధర్నా సభలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్, ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రామకృష్ణ, టి యుసిఐ రాష్ట్ర అధ్యక్షులు మరీదు ప్రసాద్ బాబు తదితరులు ప్రసంగించారు. సభకు అధ్యక్షులుగా ఎన్టీఆర్ జిల్లా సిఐటియు అధ్యక్షులు ఏ వెంకటేశ్వరరావు, ఏఐటియుసి నగర అధ్యక్షులు సాంబశివరావు వ్యవహరించారు. సిఐటియు నాయకులు కమల, టియుసిఐ నాయకులు యం. సంధ్యా తదితరులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# బలూచిస్తాన్ రైలు హైజాక్ పరిస్థితులు వివరించిన ట్రైన్ డ్రైవర్

**బాలూచిస్తాన్ (ప్రశ్న న్యూస్ )** బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) మిలిటెంట్లు జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై దాడి చేసిన ఘటనలో రైలు లోకో పైలెట్ (డ్రైవర్) అంజాద్ హైజాక్ పరిస్థితులను వివరించారు. బీఎల్ఏ మిలిటెంట్లు తొలుత ట్రాక్ ను పేల్చివేశారని వెల్లడించారు. రైలు ఆగగానే బీఎల్ఏ ఉగ్రవాదులు దాడి ప్రారంభించారని ఆయన వివరించారు. మిలిటెంట్లు రైలు కిటికీలను పగలగొట్టి లోపలికి ప్రవేశించారని, తాము చనిపోయామని వారు భావించారని వివరించారు. వారు అలా అనుకోవడమే తమ ప్రాణాలను కాపాడిందని అన్నారు. దాడి తర్వాత విడుదలైన ప్రయాణికుల్లో ఒకరు మాట్లాడుతూ, పేలుడు తర్వాత దుండగులు తమను బందీలుగా చేసుకున్నారని తెలిపారు. కమాండోలు తమ ప్రాణాలను పణంగా పెట్టి తమను రక్షించారని, సైన్యం చూపిన తెగువ తమకు ధైర్యాన్నిచ్చిందని అన్నారు. మరోవైపు, పాకిస్తాన్ సైన్యం జాఫర్ ఎక్స్‌ప్రెస్ బందీ సంక్షోభానికి ముగింపు పలికినట్లు ప్రకటించింది. నైరుతి బలూచిస్తాన్‌లో జరిగిన ఈ ఘటనలో 33 మంది దుండగులను హతమార్చినట్లు, 340 మందికి పైగా ప్రయాణికులను విడిపించినట్లు సైన్యం తెలిపింది. అయితే, బీఎల్ఏ మాత్రం సైన్యం వాదనను ఖండించింది. ఇంకా బందీలు తమ వద్దే ఉన్నారని, భద్రతా దళాలతో పోరాడుతున్నామని తెలిపింది. పాకిస్తాన్ సైన్యం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని, సైన్యం రక్షించినట్లు చెబుతున్న బందీలను తామే విడుదల చేశామని బీఎల్ఏ చెప్పుకొచ్చింది. అటు, పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ బలూచిస్తాన్‌లో పర్యటించి భద్రతా పరిస్థితిని సమీక్షించారు. దాడి బాధితులకు సంఘీభావం తెలిపారు. పెరుగుతున్న ఉగ్రవాద ముప్పును ఖండిస్తూ ఇది పాకిస్తాన్‌కు ప్రమాదకరమని ఆయన అన్నారు. శాంతి లేనిదే దేశానికి అభివృద్ధి ఉండదని ఆయన పేర్కొన్నారు. మరణించిన వారి



సంఖ్యపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సైన్యం ప్రకారం 21 మంది బందీలు, నలుగురు సైనికులు మరణించారు. అయితే, బలూచిస్తాన్‌లోని రైల్వే అధికారి తెలిపిన వివరాల ప్రకారం 25 మృతదేహాలను సంఘటనా స్థలం నుండి మచ్ పట్టణానికి తరలించారు. మృతుల్లో 19 మంది సైనికులు, ఒక పోలీసు, ఒక రైల్వే అధికారి ఉన్నారని, మరో నలుగురిని గుర్తించాల్సి ఉందని ఆ అధికారి తెలిపారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588